తీన్మార్
తెలుగు దినపత్రిక

# జడ్జీల నియామకంలో జాప్యమేల?

దేశంలో జడ్జీల కొరత తీవ్రంగా వుంది. కేసుల పరిష్కారానికి ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నాయి. ఇటీవల పార్లమెంటులో కూడా జడ్జీల కొరత గురించి చర్చ జరిగింది. దేశంలోని కోర్టుల్లో సుమారు ఐదు కోట్ల కంటే ఎక్కువ కేసులు పెండింగ్‌లో వున్నాయని న్యాయశాఖ మంత్రి ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. ప్రస్తుతం హైకోర్టులో 31% జడ్జీల కొరత వుంటే, జిల్లా కోర్టుల్లో 21% జడ్జీల కొరత వుందని ఇటీవలే సుప్రీంకోర్టు ఒక నివేదికలో వెల్లడించింది. సుప్రీంకోర్టుకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చి అండ్ ప్లానింగ్ అట్టడుగు వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించాలని సిఫారసు చేసింది. అయితే 2018లో హైకోర్టులకు 650 మంది జడ్జీలను నియమిస్తే 492 మంది జనరల్ కేటగిరిలో నియమించారని నివేదికలో పేర్కొంది. సుప్రీంకోర్టు ఇటీవల స్టేట్ ఆఫ్ ది జ్యూడిషరీ పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. మౌలిక సదుపాయాలు, బడ్జెటింగ్, మానవ వనరులు ఐసిటి అంశాలను స్పృశించింది. ఈ నివేదికను సుప్రీం కోర్టు వెబ్‌సైట్ ఈ నెల 15న అప్‌లోడ్ చేశారు. కాగా న్యాయవ్యవస్థలో అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా అధ్యయనం చేస్తారని కూడా నివేదికలో వివరించింది. రాజ్యాంగంలోని అధికరణలు 15, 16లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రభుత్వ సర్వీసుల్లో కొన్ని వర్గాలకు రిజర్వు చేయాలనే నిబంధన వుంది. ఉదాహరణకు షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్‌సి), షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్‌టి), ఇతర వెనుకబడిన వర్గాలు (ఒబిసి)లకు, ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఇడబ్ల్యుఎస్)లకు రిజర్వేషన్ కల్పించాలని రాజ్యాంగంలో ఖచ్చితమైన నిబంధన వుంది. ఇక జిల్లా స్థాయిలో జడ్జీల రిక్రూట్‌మెంట్‌లలో కూడా పైన తెలిపిన వర్గాల వారికి రిజర్వేషన్ కల్పించాల్సి వుంటుందని తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.ఇదే నివేదికలో సివిల్ జడ్జీల రిక్రూట్‌మెంట్‌ల విషయానికి వస్తే (జూనియర్ డివిజన్) రిజర్వుడ్ కేటగిరిలో ఆరు రాష్ట్రాలను తీసుకుంటే బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో పెద్ద రిక్రూట్‌మెంట్లు జరగలేదు. ఈ రాష్ట్రాల్లో అట్టడుగు వర్గాలకు చెందిన జడ్జీల ఖాళీలు అలాగే వున్నాయి. పెద్ద సంఖ్యలో జడ్జీలను నియమించాల్సి ఉంది. తాజాగా విడుదల చేసిన ఐసిటి నివేదికలో పైన తెలిపిన ఆరు రాష్ట్రాల్లో సుమారు 1,389 సివిల్ జడ్జీలు (జూనియన్ డివిజన్) సీట్లు ఖాళీగా వున్నాయని ప్రకటనలు కూడా ఇచ్చారు. దీనికి పరీక్షలు నిర్వహిస్తామని పత్రికా ప్రకటన ఇచ్చారు. వాటిలో 766 పోస్టులు రిజర్వు కేటగిరికి చెందినవి. వాటిలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుసితో పాటు ఇతర కేటగిరిలకు సంబంధించినవి వున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో రిజర్వేషన్లు ఒక్కో విధంగా వుంటాయి. అయితే ఇప్పటి రిజర్వుడ్ కేటగిరి విషయానికి వస్తే సుమారు 37.5 % సీట్లను ఇవే ఆరు రాష్ట్రాల్లో ఇప్పటికీ భర్తీ చేయనేలేదు. ఈ లెక్కన చూస్తే మొత్తం ఖాళీల విషయానికి వస్తే 66.3 శాతానికి చేరుకుంటాయి. చివరిగా సివిల్ జడ్జీలు అంటే జూనియర్ డివిజన్‌లో రిక్రూట్‌మెంట్ పరీక్ష తర్వాత ఈ ఖాళీలను పూరించలేదని నివేదకలో వివరించింది.పైన తెలిపిన ఆరు రాష్ట్రాల్లో ఎస్‌టి కేటగిరి కోసం రిజర్వు చేసిన 168 సీట్లకుగాను 142 సీట్లను ఇప్పటికీ భర్తీ చేయలేదు. అంటే 84.5% సీట్లు ఇప్పటికీ ఖాళీగానే వున్నాయి. దేశంలో పలు రాష్ట్రాల్లో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్న కేసులు సత్వరం పరిష్కారానికి పెద్ద ఎత్తున జడ్జీలను నియమించాల్సి వుంటుంది. ముఖ్యంగా రిజర్వు కేటగిరిలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని నివేదికలో సూచించింది. ఇక దేశ వ్యాప్తంగా చూస్తే 5,300 జడ్జీల కొరత ఉంది. ఇదే నివేదికలో హ్యూమన్ రీ సోర్సెస్ మేనేజ్‌మెంట్ దేశంలోని కోర్టుల్లో జడ్జీల కొరత తీవ్రంగా వుందని వెల్లడించింది. దేశ జనాభా విషయానికి వస్తే సుమారు 140.76 కోట్లు కాగా.. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 5.05 కోట్ల కేసులు పెండింగ్‌లో వున్నాయి. ఈ కేసులను పరిష్కరించడానికి దేశంలోని అన్నీ స్థాయిలో 20,850 మంది జడ్జీలున్నారు. కాగా ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నాటికి చూస్తే దేశంలోని హైకోర్టుల్లో 347 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే 31% జడ్జీ పోస్టులు ఖాళీగా వున్నట్లు లెక్క. కాగా మొత్తం జడ్జీల కేటాయింపు విషయానికి వస్తే 1,114 మంది. కాగా వాటిలో మూడో వంతు జడ్జీలు తక్కువగా వున్నారని నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి చూస్తే జిల్లా స్థాయిలో జడ్జీల సంఖ్య 25,081 మంది వుండాలి.కాగా ప్రస్తుతం జిల్లా స్థాయిలో వున్న జడ్జీల సంఖ్య 19,781గా తేలింది. ఈ లెక్కన చూస్తే 5,300 మంది జడ్జీల కొరత వుంది. ఈ లెక్కన చూస్తే 21% మంది జడ్జీలు కొరత వున్నట్లు లెక్క. ఇక మహిళా జడ్జీల విషయానికి వస్తే పరిస్థితి ఏమంత సానుకూలంగా లేదు. జిల్లా స్థాయిలో మహిళా జడ్జీలు 36.3% ఉండాలి.అయితే ఎక్కడా మహిళా జడ్జీల ప్రాతినిధ్యం మాత్రం కనిపించడం లేదు. అది సుప్రీం కోర్టు అయినా లేదా హైకోర్టుల్లో అయినా వారి ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే వుందని నివేదికలో వివరించింది. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నాటికి సుప్రీం కోర్టులో కేవలం ముగ్గురు మాత్రమే మహిళా జడ్జీలు వున్నారు. వాస్తవానికి మహిళా జడ్జీల సంఖ్య 32 వుండాలి. ఇక దేశంలోని హైకోర్టుల విషయానికి వస్తే దేశ వ్యాప్తంగా 767 పర్మినెంట్, అదనపు జడ్జీలు వుండాలి. అయితే ప్రస్తుతం కేవలం 103 మంది మహిళా జడ్జీలు మాత్రమే వున్నారు. అంటే దేశ వ్యాప్తంగా వాస్తవంగా వుండాల్సిన సంఖ్య కంటే 13.42% మంది మాత్రమే పని చేస్తున్నట్లు భావించాల్సి వుంటుంది. జిల్లాలో జ్యుడిషియల్ ఆఫీసర్ల నియామకాల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలది. ఆయా రాష్ట్రాల హైకోర్టులే దీనికి బాధ్యత వహించాలి. దేశంలోని పలు రాష్ట్రాల విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్, బీహార్, చత్తీస్‌గఢ్, కర్నాటక, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో మాత్రం జ్యుడిషియల్ పరీక్షల్లో మహిళలకు రిజర్వేషన్లు వున్నాయి. దీంతో పాటు ప్రమోషన్లలో కూడా మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తున్నాయి. అయితే కాస్తా ఊరట కలిగించే అంశం ఏమిటంటే ఇటీవల కాలంలో జ్యుడిషియల్ వ్యవస్థలో మహిళా జడ్జీల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతుండడం శుభ పరిణామమే అని చెప్పుకోవచ్చు. దేశంలోని 16 రాష్ట్రాల్లో సివిల్ జడ్జీల (జూనియర్ డివిజన్) రిక్రూట్ పరీక్షల చివరి ఫలితాలను బట్టి చూస్తే తెలుస్తోంది. ఈ పరీక్షా ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే జూనియర్ డివిజన్ సివిల్ జడ్జీల్లో 14 మంది మహిళా జడ్జీలను ఎంపిక చేశారు. అంటే 50% మంది జడ్జీలను ఎంపిక చేసినట్లు ఆ నివేదిక వివరించింది.

# రాజాపేట లో అయోధ్య శ్రీరామ అక్షింతల కలశాల ఊరేగింపు శోభాయాత్ర

**- మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు**

**- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన గ్రామం**

రాజాపేట, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో రాజపేట మండల కేంద్రంలో గ్రామ గ్రామానికి పూజిత అక్షింతల కలశ వితరణ కార్యక్రమం మంగళవారం రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ-బజరంగ్ దళ్ కార్యకర్తలు, హిందూ కార్యకర్తలు హిందూ బంధువులు హనుమాన్ భక్తులు ప్రముఖ వ్యక్తులు అందరూ పాల్గొన్నారు. రాజపేట మండల సంయోజక్ బూరుగు సంతోష్ రెడ్డి, సహసంయోజక్ తమ్మల్ విజయ్ ల ఆధ్వర్యంలో అయోధ్య రామ స్పర్శ అక్షింతల కలశ శోభాయాత్ర



కార్యక్రమంలో ప్రధాన వక్తలు పబ్బోజు శ్రీనివాస్, కటకం నాందేవ్ లు అయోధ్య రాముని గురించి సందేశానిచ్చారు. గ్రామాలలో కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించాలో చెబుతూ జనవరి 22 తారీఖు నాడు శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ఏ విధంగా చేయాలో వివరించారు. ఈ జన జాగరణ జనవరి 1 నుండి 15 వరకు గ్రామ గ్రామాలలో నిర్వహించాలని వివరిస్తూ జనవరి 22 తారీఖు నాడు అయోధ్య శ్రీరాముని యొక్క ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రతి గ్రామ గుడిలో విజయవంతంగా నిర్వహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో విహెచ్పి బజరంగ్ దళ్ కార్యకర్తలు మార్క శ్రవణ్, పోచంగళ్ళ బాబు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కటకం లక్ష్మణ్, ఉప్పల రమేష్, వధూత బాబు, ఎర్రగొకుల హనుమంత్, సట్టు నాని, కోయ



అమర్ నాధ్ భాషమైన సంపత్, ఊట్కూరి అశోక్ గౌడ్, దాచేపల్లి రాజు, దాచేపల్లి శ్రీనివాసులు, నంగునూరు రాజు, పెద్ది సంతోష్, గంగిశెట్టి రాజు, పుల్లూరు శ్రీనివాసులు, నాల్ల శేఖర్, బుడుమ సత్యనారాయణ, నంగునూరు సోమయ్య, మార్త జగదీశ్వర్, ఇమ్మడి శ్రీనివాసులు, ఇమ్మడి నరసింహులు, గంగిశెట్టి రాజు, బెజుగం చంద్రశేఖర్, బల్ల దామోదర్, బిర్రు సుదర్శన్, రాపోలు రామచంద్ర రెడ్డి, ఉప్పల శ్రీనివాసులు, గురు స్వామి సంగెం మల్లేశం, హరే రామ




హరే కృష్ణ బృందం, హిందూ కార్యకర్తలు పాల్గొన్నారు. పొట్టి మరి ఇస్కాన్ బృందం తో పాటు పలువురు భక్తులు శ్రీరామ నామ జపం సంకీర్తనలు భజనలు పాటలు నృత్యాలతో శోభాయాత్ర కొనసాగింది. ప్రధాన వీధుల గుండా శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయం, శివాలయం, మార్కండేయ స్వామి వారి ఆలయం, శ్రీ వెంకటేశ్వర



స్వామి వారి ఆలయం, పుట్ట హనుమాన్ ఆలయం, అభయాంజనేయ స్వామి వారి ఆలయం ల దర్శనాలు చేసుకుంటూ వివేకానందుని విగ్రహం వద్ద కార్యక్రమాన్ని ముగించారు. శ్రీరామచంద్రుని పల్లకి సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు మహిళలు మంగళ హారతులతో పూజలు చేస్తూ స్వాగతం పలికారు. అయోధ్య శ్రీ రామ జన్మభూమి స్పర్శ అక్షింతల కలశాల ఊరేగింపు గ్రామమంతా కాషాయమయంతో పాటు శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. బాణాసంచా కాలుస్తూ, కలశాలపై పల్లకిపై పూలను చల్లుతుండగా యాత్ర ముందుకు సాగింది. అనంతరం మండలంలోని 23 గ్రామాలకు వెళ్లిన కలశాలు గ్రామ పొలిమేరల గుండా ప్రజలు భక్తులు డప్పు చప్పులతో భజనలతో స్వాగతం పలికి గ్రామంలో ప్రదర్శన అనంతరం ఆలయంలోఏర్పాటు చేశారు.



# ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

**- ప్రజా పాలన కార్యక్రమాలు ఎనిమిది రోజులు**

**- దరఖాస్తు ఫారం ప్రతి ఇంటికి చేరాలి**

**- దరఖాస్తులను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుంది**

**- జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి**

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక ప్రగతి పెంచేందుకు చేపట్టిన కార్యక్రమం ప్రజా పాలన, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పకడ్బ బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నందు జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి ప్రజా పాలన కార్యక్రమం పై సన్నాహక ముందస్తు సమావేశమును నియోజకవర్గ స్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం కోరకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలన్నారు.డిసెంబర్ 28వ తారీకు నుండి



జనవరి 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 31 జనవరి 1 తేదీన ప్రభుత్వ సెలవు దినం కావున ఆరోజు కార్యక్రమం ఉండదని తెలిపారు. ప్రజల నుండి దరఖాస్తు స్వీకరించే పథకాలు 1.మహాలక్ష్మి పథకం,2.రైతు భరోసా పథకం, 3.గృహజ్యోతి పథకం,4.ఇందిరమ్మ ఇల్లు పథకం,5.చేయుత పథకం,ఈ పథకాలపై అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ఒక దరఖాస్తు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకు రెండు గ్రామ పంచాయతీలలో సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుం దని తెలిపారు. తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, ఎంఈఓ లు, డిప్యూటీ తాసిల్దార్లు, టీములుగా ఏర్పాటు చేసుకొని కుటుంబాల వారిగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు,మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు రెండు సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కింది స్థాయి ఉద్యోగి నుండి పై స్థాయి అధికారుల వరకు అందరూ సమిష్టిగా పని చేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చే వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి 100 దరఖాస్తులకు ఒక కౌంటర్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజాపాలన పై ప్రతి గ్రామంలో మున్సిపల్ వార్డులో విస్తృత ప్రచారం చేపట్టాలని దండోరా చేపట్టాలని, ఒకరోజు ముందుగా టామ్ టామ్ వేయించాలని తెలిపారు. ప్రజాపాలనకు సంబంధించి ప్రతి కుటుంబా నికి దరఖాస్తు అందేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. మండల స్థాయిలో, మున్సిపల్ స్థాయిలో దరఖాస్తుల స్వీకరణలో, దరఖాస్తులను భద్రపర్చడంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ నివేదికలను ఏరోజుకారోజు పంపించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రిజిస్టరును నిర్వహించాల న్నారు. పోలీస్ సిబ్బంది దరఖాస్తులు తీసుకునే కౌంటర్ వద్ద బందోబస్తు క్రౌడ్ మేనేజ్మెంట్ చూడాలన్నారు. అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సంగీత, ఆర్డీవోలు సూరజ కుమార్, మల్లయ్య, శ్రీనివాస్, సాయిరాం, అనంత రెడ్డి, జెడ్పిసిఈఓ దిలీప్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి రాజేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీపీఓ సౌమ్య, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.





# చిన్ననాటి రోజులు మరువలేనివి

**- పూర్వక విద్యార్థుల జ్ఞాపకాలు**

దేవరకద్ర ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, మదనాపురం మండలంలోని చిన్నప్పుడు గడిపిన రోజులు మరువలేనివని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993- 94వ 10 వ తరగతికి చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అందరూ ఒకరికొకరు పరిచయం చేసుకొని పాత రోజులను జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 30 సంవత్సరాల తర్వాత ఇలా కలుసుకోవడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. స్నేహితులలో ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థికంగా గాని వెనుక పడితే అందరూ కలిసికట్టుగా సాయం చేయాలని పేర్కొన్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు నాగన్న, గోపాల్, సీతమ్మ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో



పూర్వ విద్యార్థులు బాలరాజు యాదవ్, మజహర్, మహేష్ కుమార్, శివరామకృష్ణ, ఆంజనేయులు, ఆశన్న, భాస్కర్, స్వామిగౌడ్, కల్పన, లావణ్య, జయమ్మ, శ్రీలత, రవికాంత్, జయసింహ, వెంకటేష్ నాయక్, రాములు, మాసన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం



రాజాపేట, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల కేంద్రంలో చేల్మెడి ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చెల్మడి ఫంక్షన్ హాల్ యజమాని చెల్మడి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బంధుమిత్రులు, మరియు రాజాపేట పట్టణ వివిధ పార్టీలకు నాయకులు, మండల గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వృద్ధులకు,వితంతువులకు దుప్పట్ల పంపిణీ



రాజాపేట, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): క్రిస్మస్ వేడుకల సందర్భంగా మంగళవారం జాల గ్రామం సెంట్ జెకారియస్ హై స్కూల్ లో కౌంట్ సంస్థ అధినేత గొల్లపల్లి జాన్, తిబా జాన్ గొల్లపల్లి వారి ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు దుప్పట్ల పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో కౌంట్ సంస్థ మేనేజర్ దీనా డక్ స్టర్, తిమోతి జాన్ గొల్లపల్లి, గ్రామ సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి, ఉపసర్పంచ్ గంధమల్ల నరసింహులు, కొత్తజాల ఉపసర్పంచ్ పాండరీ చారి, ప్రమోద్ సింగ్, స్కూల్ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం ముంచేసింది..

కాకినాడ: కాకినాడ నగరానికి చేరుకోవడానికి ముఖ్యమైన రహదారుల్లో ఒకటైన కాకినాడ- సామర్లకోట రోడ్డును వరద ముంచెత్తుతోంది. ఈ రహదారికి సమాంతరంగా గోదావరి పంట కాల్వ ఉంది. అందులో కొన్నేళ్లుగా గుర్రపు డెక్క, పూడిక తీయడం లేదు. మిగ్‌జాం తుపాను కారణంగా కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వరద పోటెత్తడంతో వేగంగా వెళ్లే మార్గంలేక పక్కనే ఉన్న రహదారిపైకి మళ్లింది. అసలే గుంతలతో ఉన్న మార్గంపై నీరు ప్రవహిస్తుండటంతో ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పూడిక తొలగించి కాల్వకు లైనింగ్ పనులతో పాటు రహదారికి కాల్వకు మధ్య గోడను నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ గెలుపుకు కార్యకర్తలే పాత్రే కీలకం

- కార్యకర్తల కష్టం వెలకట్టలేనిది
- విజయోత్సవ సభలో ఎమ్మెల్యే జిఎంఆర్
- త్వరలో గుడ్ మార్నింగ్ దేవరకద్ర
- ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజులలో అమలు చేస్తాం
- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి



దేవరకద్ర ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ జిల్లా, దేవరకద్ర నియోజకవర్గం, మూసాపేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభకు, మూసాపేట్ మండల కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి(జిఎంఆర్), టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ కి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. అనంతరం జిఎంఆర్ మాట్లాడుతూ తన గెలుపునకు



కృషి చేసిన నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో వెన్నంటే ఉండి తనను ముందుకు నడిపించిన కార్యకర్తలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యకర్తల కష్టం వెలకట్టలేనిది అన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరు అడ్డుకోలేరని, ప్రజలంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారని, ప్రజల అండదండలతో రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి బిఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని తెలియజేశారు. ఈ నెల 28వ తేదీ నుండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. గ్రామ సభలలో ప్రజలు రేషన్ కార్డులు తదితర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. త్వరలో నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి గుడ్ మార్నింగ్ దేవరకద్ర అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజులలోగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దళిత విద్యార్థి సాయి కుమార్ మృతి పై సమగ్రవిచారణ జరిపించాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- పేద దళిత కుటుంబానికి న్యాయం చేయాలి
- సామాజిక ప్రజా సంఘాల నేతలు



నల్లగొండ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): ఈ నెల 23న రాయినిగూడెం వద్ద దళిత విద్యార్థి అన్నిమల్ల సాయికుమార్ రైలు పట్టాల పై శవమైన తేలిన సంఘటనపై సామాజిక ప్రజా సంఘాల అధ్యర్యంలో మంగళవారం నల్లగొండ జిల్లా ఎస్పీ అపూర్వ రావుకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, మాల మహానాడు జాతీయ నాయకులు తాళ్లపల్లి రవి మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒకేషనల్ విద్యార్థి అన్నిమల్ల సాయికుమార్ రైలు పట్టాల పై శవమైన తేలిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యుల పై చట్టపరమైన చర్యలు తీసుకొని దళిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో గల ఎస్సీ బాలుర (బి) హాస్టల్ లో గత సంవత్సరం నుండి ఉంటూ కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న అనిమల్ల సాయికుమార్ దళిత విద్యార్థి రాయినిగుడెం దగ్గర రైలు పట్టాల పై (23.12.2023)శవమై కనిపించాడన్నారు. నల్లగొండ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టార్టం చేయించి శవాన్ని కుటుంబ సభ్యులకు మాత్రమే అప్పగించడం జరిగిందన్నారు. ఎవరో పోన్ చేస్తే రాత్రిపూట హాస్టల్ నుండి వెళ్లినట్లు తెలుస్తున్నదన్నారు. కనీసం హాస్టల్ వాచ్ మెన్ కూడా లేదని తెలుస్తందన్నారు. అధేవిధంగా అతని చెస్ట్ పై 'S' అనే అక్షరం రాసి ఉందని ప్రేమ వ్యవహారంలో ఎవరైనా చంపి ఉంటారా అనే అనుమానాలుకుటుంబ సభ్యులకు తలెత్తున్నాయన్నారు. రాత్రి విద్యార్థి అక్కడ నుండి ఏలా వెళ్లాడు.? ఎవరైనా తీసుకెళ్లారా.! శవమై తేలడానికి గల కారణాలు ఏమిటో అతని తోటి స్నేహితులను, ఫోన్ కాల్ డేటాను సమగ్రంగా విచారణ చేసి బాధ్యుల పై చట్టపరమైన చర్యలు తీసుకొవాలాని కోరారు. నిరుపేద దళిత విద్యార్థి కుటుంబాన్ని తమరి ద్వారా 20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇప్పించే విధంగా ప్రభుత్వానికి సిఫార్సు లు చేసి ఆదుకోవాల్సిందిగా ఎస్పీ ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి గోలి సైదులు, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు మానుపాటి బిక్షమయ్య, మాల మహానాడు జిల్లా నాయకులు చింతపల్లి బాలకృష్ణ, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అద్దంకి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి



నల్లగొండ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అంగన్వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచడం ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి కోరారు. మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్ లో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నల్లగొండ జిల్లా కమిటీ సమావేశము జిల్లా అధ్యక్షురాలు పొడిశెట్టి నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే నూతన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని, అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కార్యాలయాల దగ్గర ప్రాజెక్టు మీటింగులు సెక్టార్ మీటింగ్లో వలె మండలాల వారిగా జరపడం సరైనది కాదని, గతంలో వలే ప్రాజెక్టు మొత్తం ఒకే రోజు సమావేశాలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాజెక్టు మీటింగ్ లకు కనీస వసతులు కల్పించాలని కోరారు. అంగన్వాడీలకు 24 రోజుల సమ్మె కాలం వేతనాలు వెంటనే చెల్లించాలని, రెండో పిఆర్సి , ఐ అర్, అంగన్వాడి ఉద్యోగులకు వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీచేయాలని, రెండో పిఆర్సి ఫైనల్ చేసేటప్పుడు పేస్కేలు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలని కోరారు. రిటర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష, ఆసరా పెన్షన్ 60 సంవత్సరాలు దాటిన వారికి విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. కనీస వేతనాలు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్లో సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి మహాలక్ష్మి ఇందిరమ్మ ఇండ్లు పెన్షన్ రేషన్ కార్డులు ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలు అంగన్వాడీ ఉద్యోగులకు వర్తింపచేయాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు హాజరవుతున్న అంగన్వాడీ ఉద్యోగులకు టీఏడీఏలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శ బి పార్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు అంబటి మణెమ్మ, మణిరూప, ప్రకృతాంబ, సునంద, జి.రాధాబాయి, రాశిదా ఏ.యాదమ్మ , బి.శ్రీదేవి, కే.సుదా లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# అవయవాలు దానం చేసిన వ్యక్తి కుటుంబానికి రావుల ఆర్థిక సహాయం



దేవరకద్ర ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం, కానాయపల్లి గ్రామానికి చెందిన నక్కల రాము అనే యువకుడు ఈనెల 15న ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాదు లోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందారు. తలకు బలమైన గాయం అవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలిపారు.

అక్కడే మూడురోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే అక్కడి డాక్టర్ల సూచన మేరకు నక్కల రాము అవయవాలను దానం చేసి పదిమందికి ప్రాణదాతలు కావాలని కుటుంబ సభ్యులకు సూచించారు. తమ కుమారుడు మృతి చెందిన తన అవయవాల ద్వారా పదిమందికి ప్రాణాలు నిలబడతాయని ఉద్దేశంతో జీవన్ అమర్ ట్రస్ట్ నిర్వాహకులకు అవయవాలను దానం ఇచ్చేందుకు అంగీకరించి తమ పెద్ద మనసును చాటుకున్నారు. నక్కల రాము అవయవాలను దానం చేయడం ద్వారా తమ గ్రామమైన కానాయపల్లికి గుర్తింపు వచ్చిందని తెలియడంతో మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి తన స్వగ్రామమైన కానాయపల్లి కి వచ్చి నక్కల రాము కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల ఆర్థిక సహాయం చేశారు. అవయవాలు దానం చేసిన నక్కల రాము జ్ఞాపకార్థం పదిమందికి ఉపయోగపడే ఆదర్శవంతమైన కార్యక్రమాన్ని చేపట్టాలని రావుల చంద్రశేఖర్ రెడ్డి గ్రామస్తులకు తెలిపారు. ఈ సందర్భంలో మాజీ సర్పంచ్ పోతులపల్లి యాదయ్య సాగర్, రావుల రఘువర్ధన్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు నక్కల శాంతన్న, గ్రామ టిఆర్ఎస్ ప్రెసిడెంట్ హొటల్ రాజు, పి.వెంకటేశ్వర్లు, సింగిల్ విండో డైరెక్టర్ దారముని నాగరాజు, జే.పెద్ద కురుమయ్య, శాస్త్రి పాస్టరు, కొండిగారి రాజు, నక్కల పెద్దగిరి రాముడు, చిన్నాన్న తదితరులు పాల్గొన్ని నక్కల రాము చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

# శ్రీరాముడి ఆలయ నిర్మాణంతో కోట్లాది ప్రజల కల నెరవేరింది





నేరేడుచర్ల, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): భారతదేశం లో వందల సంవత్సరాలుగా కలలు కంటూ ఎదురు చూస్తున్న భారతీయ ప్రజల కలలు సహకారమై శుభదినం శ్రీ రామ జన్మభూమి అయోధ్యలో శ్రీ సీతా రామా భవ్య ఆలయ నిర్మాణంతో భారతీయ ప్రజల కలలు నెర వేరయని తెలంగాణ ప్రాంత సహకార్యవాహ యాత్రా నర్సింగ రావు అన్నారు. వేదమంత్రాల మధ్య పూజలు నిర్వహించిన అయోధ్య రామయ్య తండ్రి అక్షింతల కళాశాలు సూర్యాపేట జిల్లా, నేరేడుచర్ల పట్టణంలో మంగళవారం అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామి సాక్షిగా అయోధ్య రామయ్య తండ్రి అక్షింతల కళాశాలను ఆలయ పూజారులు పూజలు నిర్వహించారు. పూలతో అలంకరించిన రథంపై పురవీధులలో ఊరేగించారు. లయబద్ధమైన కోలాటాలతో మహిళల కోలాటం ఆకట్టుకుంది. సన్నాయి వాయిద్యం డీజే లతో జైశ్రీరామ్ నినాదాలతో చక్కటి భక్తి పాటలతో రామయ్య తండ్రి భక్తి పాటలతో పుర ప్రముఖులు కదం తొక్కారు. రామ భజనలతో ఆటపాట ఆడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ శేఖర్, మెట్టు వేణుగోపాల్ రెడ్డి, కొనతం సత్యనారాయణ రెడ్డి, నాగండ్ల శ్రీధర్, రాచకొండ రామన్న, చల్లా శ్రీలత రెడ్డి, కొనతం సీతారాం రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, ధూళిపాల ధనుంజయ నాయుడు, సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి, కొనతం నాగిరెడ్డి, జంగిలి వెంకటేశ్వర్లు, మచ్చ శ్రీను, అంకతి అప్పయ్య ఇంజమూరి రాములు రాచకొండ శ్రీనివాస్, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, మాశెట్టి మోహన్, మిడిశినమెట్ల సతీష్, విజయ్, కృష్ణయ్య, వినోద్,రామకృష్ణ, లక్ష్మణ్, హిందూవు బంధుమిత్రులు, అధిక సంఖ్యలో మరియు మహిళా భక్తి బృందం కోలాటం తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిజం అజేయమైనది

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి



నల్లగొండ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడే కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో అజేయంగా నిలుస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 99వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా కొండమల్లేపల్లిలో సిపిఐ జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచిత పోరాటాలు చేసిన ఘన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందని గుర్తు చేశారు. భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమ సాధనలో సిపిఐ పార్టీది ప్రత్యేక స్థానం అని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు ప్రజలందరూ ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ సంపాదన మొత్తం కొద్దిమంది వ్యక్తులకు దోచిపెడుతూ పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. దోపిడీ లేని మనిషి మనిషిగా బతికే సమసమాజ స్థాపన కోసం ఎర్రజెండా పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. పాలక ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మికొండ వెంకటేశ్వర రెడ్డి మల్లచారి, కల్లు చరణ్ రెడ్డి, సుంకయ్య, కురాకుల వెంకటయ్య, హరి, పర్ష నాయక్, సోమ్లా వెంకటయ్య, శంకర్, హతిరాం, లక్ష్మయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ప్రారంభం

- కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- కొలనుపాకలో అవగాహన సదస్సు ఏర్పాటు



భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర రూరల్ డెవలప్మెంట్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ రాహుల్ కాశ్యాప్ తెలిపారు. మంగళవారం నాడు ఆయన ఆలేరు మండలం కొలనుపాక, భువనగిరి మండలం జమ్మాపూర్ గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడే అభివృద్ధి సంక్షేమ పథకాలు గ్రామాలు పట్టణాలలో ఏ విధంగా అమలు జరుగుతున్నాయో తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలందరికీ చేరాలని, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ పథకం, కిసాన్ పెట్టుబడి, ఉజ్వల్ పథకాలను అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా లెడ్ స్క్రీన్ ద్వారా ప్రధానమంత్రి సందేశం ప్రదర్శించారు. 2047 వరకు అభివృద్ధి చెందుతున్న భారతదేశం అభివృద్ధి చెందిన భారతదేశం కావాలనే సంకల్పంపై ఈ ప్రసంగం సాగింది. ఈ కార్యక్రమాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, నాబార్డ్ అధికారి వినయ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మేనేజర్, స్వయం సహాయక సంఘాలు, ఐకెపి, సెర్ప్ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# యాచారంలో రోడ్డు ప్రమాదం

- కారు బైక్ ఢీ యువకుడు మృతి



యాచారం, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): కారు, బైక్ ను ఢీకొనడంతో బైక్ పై వెళ్తున్న ముగ్గురికి తీవ్రగాయలై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొండి గౌరెల్లి గ్రామానికీ చెందిన కట్టెల నాని తండ్రి యాదయ్య వయసు (18),కట్టెల సన్నీ తండ్రి యాదయ్య (17), అతని స్నేహితుడు విదుర్బాయి మనోహర్ తండ్రి దేవయ్య వయసు (16) పై ముగ్గురు కలిసి తేదీ 25-12-2023 సోమవారం నాడు రాత్రి 10:30 గంటలకు డిఎస్ఆర్ గార్డెన్ నందు ఫంక్షన్ కు హాజరై తిరిగి వారి యొక్క స్వగ్రామమైన మొండి గౌరెల్లి కి బయలుదేరుతుండగా డిఎస్ఆర్ గార్డెన్ ఎదురుగా వారి యొక్క పల్సర్ నెంబర్ టి ఎస్ 07 జె ఎ 0361 వాహనం పై రోడ్డు క్రాస్ చేస్తుండగా ఇన్నోవా కార్ నెంబర్ ఎ పి 28 డి 289 గల డ్రైవరు అతివేగముగా జాగ్రత్తగా పై ముగ్గురు వెళ్తున్నటువంటి పల్సర్ బైకు ఢీకొనగా కట్టెల నాని అక్కడికక్కడే మృతి చెందాడు. కట్టెల సన్నీ, విదుర్బాయి మనోహర్ కు గాయాలు జరిగినాయి. అట్టి విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు వారిని పోలీసు వారి సహాయంతో ఓవైసీ హాస్పిటల్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని సిఐ సైదయ్య తెలిపారు.

# ప్రజాపాలనపై ముందస్తు సన్నాహక సమావేశం

**- ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి**
**- జిల్లా కలెక్టర్ లతో సమావేశం**
**- హాజరైన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు**

భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్):ప్రజాపాలన కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని, ప్రతి ఒక్కరి దరఖాస్తు స్వీకరించాలని, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, నల్లగొండ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మంగళవారం నాడు నల్గొండ పట్టణంలోని ఏంఎన్అర్ కన్వెన్షన్ హాలులో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రజాపాలన కార్యక్రమం ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించబడింది. కార్యక్రమానికి రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ఆయన సన్నాహక సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంగా సన్నాహక సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆరు గ్యారెంటీల పథకాల అమలు కోసం రాష్ట్ర మంత్రివర్గం, జిల్లా కలెక్టర్లతో సమావేశమై దిశా నిర్దేశం చేశారని అన్నారు. ఈనెల 28వ తేదీ నుండి వచ్చే నెల 6 వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రణాళిక బద్ధంగా దరఖాస్తులు స్వీకరించాలని, అందుకోసం ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సంఘటన జరగకుండా చూడాలని, బాధ్యతాయుతంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని, అందరికీ సౌకర్యంగా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, దరఖాస్తులు నింపే విధంగా యంత్రాగాన్ని సమాయత్తం చేసుకోవాలని, అలాగే హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసుకోవాలని, సాధారణ దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రద్దీ ఎక్కువ ఉన్నచోట టీములను పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ కార్యక్రమాన్ని అందరూ సమన్వయ భాగస్వామ్యంతో విజయవంతంగా



పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ వంద రోజులలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు. ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని, ప్రభుత్వ ఉద్దేశాలను అధికారులు నెరవేర్చాలని అన్నారు. ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో రెండు పథకాలు ఇప్పటికే అమలు చేస్తున్నామని, యావత్ తెలంగాణలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, అందరికీ ఆరోగ్యం రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద 10 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రారంభించినట్లు తెలిపారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇచ్చే కార్యక్రమం త్వరలో మొదలుపెడతామని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల సంక్షేమ కార్యక్రమాల విషయంలో పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉంటామని, అధికారులు కూడా న్యాయంగా ధర్మంగా చట్టపరంగా ముందుకెళ్లాలని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగానే ఆరు గ్యారెంటీలు అమలు అవుతాయని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్కువ మంది ఉన్నచోట ముందే తగిన జాగ్రత్తలు చేసుకోవాలని, పెద్ద గ్రామపంచాయతీలలో, మున్సిపల్ వార్డులలో క్యూ లైన్లు ఏర్పాటుచేసి



ఎక్కువ కౌంటర్లతో నియంత్రించాలని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నీటిపారుదల రంగంలో అన్యాయం జరిగిందని, గత పదేళ్లలో ఒక ఎకరానికి కూడా నీరు తీసుకురాలేదని, ఈ ప్రభుత్వం అలాకాకుండా నీటి పారుదల రంగానికి ప్రాధాన్యతనిచ్చి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. రేషన్ బియ్యం సంబంధించి ప్రతి కిలో బియ్యాన్ని 39 రూపాయలు వెచ్చించి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందిస్తున్నామని, దురదృష్టం ఏమిటంటే ఆ బియ్యం రీసైకిలింగ్ అవుతుందని, పొర్ట్రీలకు వెళు తున్నదని, ఇది దుర్మార్గమైన విషయమని, అసాంఘిక శక్తుల పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. రేషన్ సరఫరా విషయంలో ప్రక్షాళన చేస్తామని నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని అన్నారు.

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అభయ హస్తం క్రింద ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలు



ప్రారంభించుకున్నామని తెలియజేస్తూ, పాలసీలను ప్రజాప్రతినిధులమైన మేము తయారు చేస్తామని, వాటిని ప్రతి పేదవారికి అందించేది మీలాంటి అధికారులేనని అన్నారు. పటిష్టమైన ఏర్పాట్లతో, తగిన టీములతో ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించాలని, దరఖాస్తులు నింపేందుకు తగిన ఏర్పాటు చేయాలని సూచించారు, మంచినీటి సౌకర్యం, టెంట్లు, కుర్చీలు, వసతులు ఏర్పాటు చేయాలని, అలాగే ఆరోగ్య సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గిరిజన గ్రామ పంచాయతీలలో దరఖాస్తుదారులు ఎవరు కూడా మిస్ కావద్దని, అందుకు తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ పేదవాని వద్దకు ప్రభుత్వ పథకాలు తీసుకుపోవాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. అందరం భాగస్వాములమై తెలంగాణను బాగు చేసే విషయంలో భాగస్వాము లము కావాలని, నిర్బంధ పాలన నుండి ప్రజాపాలన దిశగా నడు ద్దామని అన్నారు. అధికారులు ఎక్కువసేపు పనిచేయాలని తెలంగాణ పునర్నిర్మాణంలో పాలుపంచుకోవాలని అన్నారు. జిల్లాలో యువతను పెడదారి పట్టించే బెల్టు షాపులు, గంజాయి అమ్మకాలపై పోలీసులు ఎక్కువ శ్రద్ధ పెట్టాలని, ఇసుక, గంజాయి, వైన్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని, అందరికీ అందుబాటులో ఉ ంటామని అన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే యాదాద్రి భువనగిరి జిల్లాలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమ



ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీ ఏర్పాట్లతో ప్రజల వద్దకు తీసుకు వెళ్తామని, ప్రభుత్వం ఆశించే



లక్ష్యాలను నెరవేరుస్తామని తెలిపారు. 2 లక్షల,18 వేల 807 కుటుంబాలకు సంబంధించి మున్సిపాలిటీలలో 14, గ్రామీణంలో 37 కలిపి మొత్తం 51 టీములతో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఇందుకోసం 1961 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రేపటినుండి గ్రామాలలో, మున్సిపల్ వార్డులలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని, గ్రామసభలో ఎవరైనా దరఖాస్తుదారులు ఇవ్వలేకపోతే వారి వద్ద నుండి తిరిగి తీసుకుంటామని, ఎవరైనా ఆ సమయంలో రాకపోయినా తర్వాత కూడా వారి వద్ద నుండి స్వీకరిస్తామని తెలిపారు. ప్రజా పాలనలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, అలాగే చేయూత పథకాల కు సంబంధించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజు 2 షిఫ్ట్ లలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సన్నాహక సమావేశంలో ప్రభుత విప్ బీర్ల ఐలయ్య, శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బాలు నాయక్, వేముల వీరేశం, నల్లమాద పద్మావతి, బి.లక్ష్మా రెడ్డి, కె. జయవీర్ రెడ్డి, మందుల సామెల్, నల్గొండ ఇన్ ఛార్జ్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, సూర్యాపేట ఇంచార్జి కలెక్టర సిహెచ్.ప్రియాంక, నల్గొండ ఎస్పి.అపూర్వ రావు, డిసిపి. రాజేష్ చంద్ర, ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఏ.భాస్కరరావు, ఏ.వెంకటరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# టెక్స్టైల్ కోర్సులో సిలబస్ లేక విద్యార్థుల అవస్థలు

సిరిసిల్ల : సిరిసిల్లలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించి మూడేళ్లవుతుంది. దీనిలో టెక్స్టైల్ టెక్నాలజీలో రెండేళ్లుగా ఒక్కరూ ప్రవేశాలు పొందలేదు. తొలి ఏడాది ఎంసెట్, ఈసెట్ ద్వారా వచ్చిన 14 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ కోర్సుకు రెండేళ్లుగా అగ్రహారం పాలిటెక్నిక్ డిప్లొమా, ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నారు. జేఎన్టీయూలోనే కొత్త కోర్సు కావడం, మూడేళ్లుగా కనీసం సిలబస్ను రూపొందించకపోవడం చూస్తుంటే బోధన ఏ తీరున సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ కోర్సుల ప్రయోగాల కోసం కొండగట్టు జేఎన్టీయూకు పంపుతున్నారు. 2021లో ప్రారంభమైన కళాశాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం ఇటీవల తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో స్థలం కేటాయించింది. ప్రస్తుతం అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కొంత భాగాన్ని జేఎన్టీయూ కళాశాలకు వినియోగిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా రొబోటిక్స్, ఐవోటీ, బ్లాక్చైన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, ఏఐ తదితర ఎమర్జింగ్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఈక్రమంలో కోర్ బ్రాంచిలైన మెకానికల్, సివిల్ తదితర బ్రాంచిల్లో ప్రవేశాలు తగ్గాయి. ఈ బ్రాంచిలకు క్రమంగా డిమాండ్ తగ్గుతోంది. టెక్స్టైల్ విభాగానిది కూడా అదే పరిస్థితి. జేఎన్టీయూలో మూడేళ్ల క్రితం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ కోర్సుపై శీతకన్ను వేశారు. ప్రవేశాలు పొందే సమయంలో కళాశాల అధ్యాపకులు ఉస్మానియాలోని టెక్స్టైల్ ఇంజినీరింగ్ విభాగంతో ఎంవోయూ చేసుకుని బోధన కొనసాగిస్తామని విద్యార్థులకు చెప్పారు. ఇప్పటికీ మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టినా ఆ ఊసేలేదు. ఇటు జేఎన్టీయూ కూడా కోర్సుకు సిలబస్ను రూపొందించలేదు. దీంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలోని 2018 సంవత్సరం టెక్స్టైల్ కోర్సు సిలబస్ను ఒప్పంద అధ్యాపకులతో రెండో ఏడాది బోధించారు. కళాశాలలో ఆరు కోర్సులకు గాను రెగ్యులర్ అధ్యాపకులు ముగ్గురు, ఒప్పంద ప్రాతిపదికన నలుగురు, పీరియడ్ లెక్కన బోధించేవారు 26 మంది ఉన్నారు. టెక్స్టైల్ మినహా మిగతా అయిదు కోర్సులు, మూడు సంవత్సరాలకు కలిపి 787 మంది విద్యార్థులున్నారు. క్యాంపస్ సెలక్షన్స్ కోసం పలు కంపెనీల బృందాలు ఈ ఏడాది కళాశాలలను సందర్శించనున్నాయి. ఆయా కంపెనీలు విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసుకుంటాయి. అన్ని కోర్సుల విద్యార్థులకు ఈ సంవత్సరం ఎంతో కీలకం. ఇక టెక్స్టైల్ కోర్సులోని విద్యార్థులు మూడో సంవత్సరంలోకి వచ్చినా ఇప్పటికీ వీరికి కనీసం ల్యాబ్లు లేవు. స్టడీ టూర్ల ఊసేలేదు. దీనిపై విద్యార్థులు రెండు నెలల క్రితం జేఎన్టీయూ ఉప కులపతికి ఆన్లైన్లో వినతి పత్రం సమర్పించారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. సంప్రదాయ కోర్సులు కనుమరుగవుతున్న వేళ విద్యార్థులకు మంచి ఉపాధి కల్పించే టెక్స్టైల్ కోర్సులను ఇంకా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఆధునికతకు తగ్గట్టుగా దుస్తుల తయారీలో యువతను ఆకట్టుకోవడంతో పాటు ఈ రంగంలో దీర్ఘకాలం ఆదరణ పొందవచ్చు. దానివల్ల జిల్లాలోని వస్త్ర పరిశ్రమ మరింత విస్తరించడంతోపాటు వృద్ధి




చెందుతుంది. ఇవన్నీ జరగాలంటే కళాశాల స్థాయిలోనే విద్యార్థులకు ఈ రంగంపై పూర్తి పట్టు తీసుకురావాలి. అప్పుడే యువత వస్త్ర పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తారు. పాలిటెక్నిక్ కళాశాలలోని డిప్లొమా, జేఎన్టీయూలోని ఇంజినీరింగ్ కోర్సులతో ఈ రంగంలోని అవకాశాల గురించి విద్యార్థులకు తెలియజేయాలి. దానికి అవసరమైన నూతన పాఠ్య ప్రణాళిక, బోధన సిబ్బంది, మౌలిక సదుపాయాలను కల్పించేలా చొరవ చూపాలి. అవసరమైతే టెక్స్టైల్ పార్కు, అపరెల్ పార్కులోని పరిశ్రమలతో సమన్వయం చేసుకోవాలి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో సిరిసిల్లలో వస్త్రోత్పత్తి రంగంలో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంటుంది. ఫలితంగా ఇక్కడ జేఎన్టీయూలో టెక్స్టైల్ కోర్సు ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుంది.


# టీజేయు ఆధ్వర్యంలో ఈనాడు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



భువనగిరి, డిసెంబర్ 26(తీన్మార్ న్యూస్): పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, గోనె శ్రీనివాస్ ఈనాడు జన్మదిన సందర్భంగా వారి ఇంటికి వెళ్లి శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు షానూర్ మరియు జిల్లా కమిటీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఖాజా పసియుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఖదీర్, మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, జిల్లా ప్రచార కార్యదర్శి బైరపాక సీరిల్, జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా మురుగుకాలువ


కరీంనగర్ : అయిదేళ్లకు ఒకసారి జరిగే శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. రెండు నెలలుగా అమల్లో ఉన్న ఎన్నికల కోడ్ మూడు రోజుల కిందట ముగిసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, అధికారులు ఎప్పటిలాగే యథావిధిగా కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. రెండు నెలలుగా ఎన్నికల కారణంగా పనుల్లో పురోగతి లేకపోగా, ఎన్నికల సంఘం పలువురు అధికారులు, ఉద్యోగులకు ఎన్నికల విధులను అప్పగించడంతో కార్యాలయాలు బోసిపోయాయి. అత్యవసర దస్త్రాలు, పనులు మినహాయిస్తే ఏ ఒక్కటీ ముందుకు కదలలేదు. మరో ఆరు నెలల వరకు నగరాలు, పట్టణాల్లో ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఆ లోపు పూర్తి చేసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో స్మార్ట్సిటీ, సీఎంఏ నిధులు, జనరల్ ఫండ్, సుడాకు సంబంధించిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎన్నికలను కారణంగా చూపించడంతో అభివృద్ధి పనులకు అంతరాయం కలిగింది. ప్రధానంగా కూడళ్ల సుందరీకరణ, సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ రాకముందు హడావుడిగా రూ.132 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. అన్ని డివిజన్లలో ఒకటెండ్రు చోట్ల ప్రారంభించి పూర్తి చేయగా మిగతా చోట్ల నత్తను మించి పోటీ పడుతున్నట్లుగా తయారైంది. పలు వీధుల్లో తవ్వి మురుగుకాలువలు, రహదారులు అసంపూర్తిగా వదిలేశారు. కొన్ని చోట్ల అయితే 20 రోజులుగా రాకపోకలు సాగించకుండా మారడంతో ఆయా ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. ఒక వైపు పూర్తి చేయడం, మిగతా వైపు వదిలేయడంతోనే సమస్యలు వస్తున్నాయి. వర్షం చినుకులతో బురదగా మారిందని ఆ ప్రాంతవాసులు



ఆగ్రహిస్తున్నారు. అభివృద్ధి పనులతోపాటు ప్రజలకు సంబంధించిన దస్త్రాలు, ఫిర్యాదులు పరిష్కరించేందుకు విభాగాల వారీగా మేయర్, కమిషనర్తోపాటు విభాగాల అధికారులు వరుస సమీక్షలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపడితే ప్రజలకు సౌకర్యంగా మారనుంది. నగర పాలక సంస్థ పరిధిలో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్లు, కమ్యూనిటీ భవన నిర్మాణాల కోసం సాధారణ నిధులు సుమారు రూ.20 కోట్లకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. కొన్నింటిని పిలవగా మిగతావి ఆన్లైన్ చేసే లోపే ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. టెండర్లు పూర్తయిన వాటికి ఖరారు చేసి, మిగతా పనులకు తిరిగి టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. సుడా పరిధిలోని గ్రామాల్లో సెంట్రల్ లైట్లు బిగించేందుకు, మానకొండూర్ చెరువు అభివృద్ధి, ఇతర పనులు చేసేందుకు రూ.17 కోట్లతో టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# ఈసురోమంటున్న ఇళ్ల నిర్మాణం

గుంటూరు జిల్లాప్రతినిధి : జగనన్న కాలనీల్లో పక్కా గృహ నిర్మాణం మందకొడిగా సాగుతోంది. ఇప్పటి వరకు పలు కారణాలతో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకోలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 69,912 ఇళ్లను తొలిదశలో మంజూరు చేయగా ఇప్పటి వరకు మ్యాపింగ్ చేసిన వాటిల్లో 63,361 ఇళ్లను చేపట్టారు. వీటిల్లో కేవలం 8,705 ఇళ్లు మాత్రమే పురోగతిలో ఉన్నాయి. వీటిని ఉగాది నాటికి పూర్తి చేయించాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు సూచించింది. ఒక్కో ఇంటికి రూ.లక్షా 80 వేలు, మరో 35 వేలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి మొత్తం రూ.2.15 లక్షలతో ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. మొదటి, రెండు కేటగిరిల్లో లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా చేపట్టినవి 41 వేల వరకు ఉన్నాయి. ప్రభుత్వమే నిర్మించి ఇచ్చేలా మరో 22 వేలు ఇళ్లు ఉన్నాయి. గుంటూరు నగర వాసులకు దాదాపు 62 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా 20 వేల ఇళ్లు తొలిదశలో నిర్మించాలని నిర్ణయించారు. పేరేచర్ల, ఏటుకూరు, లాం, కొర్నెపాడు, బుడంపాడు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. కొర్నెపాడులో ఒక కాలనీలో ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా చేపట్టలేదు. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేవు. రెండో కాలనీలో వందల సంఖ్యలో చేపట్టారు.గుంటూరు నగర వాసులకు ఇళ్లు కేటాయించిన పేరేచర్ల జగనన్న కాలనీలో18 వేల ఇళ్లు మంజూరు చేయగా 10 వేల ఇళ్లు



కాంట్రాక్టరు ద్వారానే నిర్మించాలని తలపెట్టారు. కానీ ఇంత వరకు పట్టుమని 10 ఇళ్లుకూడా పూర్తి చేసి గృహ ప్రవేశం చేయించలేకపోయారు. మెప్మా, డిఆర్డిఎ ద్వారా జిల్లా మొత్తం మీద 25 వేల మందికి రూ.35 చొప్పున రుణాలు ఇప్పించినట్టు అధికారులు చెబుతున్నారు. అయినా ఇళ్లు పూర్తి అయ్యే పరిస్థితి లేదు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు కేటాయించి ఇసుక ఉచితంగా, సిమెంటు, ఇనుము ఇతర మెటీరియల్ తక్కువ ధరకు సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ 48 నుంచి 72 అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పక్కా ఇళ్లకు కనీసం నాలుగు నుంచి ఐదు లక్షలు ఉంటేనే పూర్తవుతాయని లబ్ధిదారులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో నిర్మాణం కష్టమని తెలిసినా అధికారులు లబ్ధిదారులపై వివిధ రూపాల్లో వత్తిడి తెస్తున్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

## గ్రామ అభివృద్ధి కమిటీ..



డిచ్ పల్లి: ఇసుక వ్యాపారులు అక్రమంగా ఇసుకను తరలిస్తు ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పాటు చేసి నీరు నిల్వ లేకుండా చేస్తున్నారని, దీంతో చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్ బావుల్లో నీరు లేకుండా చేస్తున్నారని వేంటనే అదికారులు జోక్యం చేసుకుని అరికట్టడానికి చర్యలు చేపట్టాలని తిర్మన్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్ అధ్వర్యంలో ఎంపిటిసి చింతల దాస్, సభ్యులతో కలిసి తిర్మన్ పల్లి శివారు లోనే మారి వాగు ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొరివాగు నుండి రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక వ్యాపారులు అదికారులతో కుమ్మక్కై రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని వివరించారు. అదికారులకు లంచాలు అంటగట్టి ఇష్టానుసారంగా అడ్డు అదుపు లేకుండా ట్రాక్టర్, టిప్పట్ల ద్వారా ఇసుకను రవాణ చేస్తు లక్షలు రూపాయలు సంపాదించు కుంటున్నరని, పలుమార్లు వారిని హెచ్చరించిన తమకు అదికారులు ఉన్న రాని , మరింత రెచ్చిపోతున్న రాని,ఇదంతా అదికారుల కనుసైగలోనే జరుగుతుందని దీనికి అధికారులు వత్తసు పలికి లంఛలు తిసుకుంటు ఇసుక వ్యాపారులకు మద్దతు పలకం వల్లే, అడ్డు అదుపు లేకుండా వాగునుండి ఇసుక తరలించి రైతులకు తీరని నష్టం కల్పిస్తున్నారని, అక్రమ ఇసుక తరలించకుండ అరికట్టి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇదే విషయమై త్వరలో కలెక్టర్, ఉన్నతాధికారులకు కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

# పరిశ్రమల ఏర్పాటు పై అవగాహన కార్యక్రమం



కంటేశ్వర్: నిజాంబాద్ జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ వారి జిల్లా అందుల వనరుల కేంద్రంలో సూక్ష్మ చిన్న మధ్యంతర పరిశ్రమల కేంద్ర మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో షెడ్యూల్ తెగలు ఎస్టి యువతకు సూక్ష్మ మధ్యతరగ పరిశ్రమల ఏర్పాటు పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎం ఎస్ ఎం ఈ-డీఎఫ్ఓ హైదరాబాద్ సహాయక సంచాలకులు రాజేష్ కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్సవ వంతులైన పారిశ్రామికవేత్తలకు శిక్షణను అందించారు. యువత కూలి పని చేయడం ద్వారా తమ కుటుంబాల అవసరాలు తీర్చలేదని వారు ఎప్పుడు బీదవారిగానే మిగిలిపోతున్నారని వారి చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నట్లయితే ప్రభుత్వాలు వారికి కావలసిన ఆర్థిక సహాయం ముడి సరుకుల సరఫరా మార్కెట్లకు సహాయం అందిస్తామని ముఖ్యంగా ఎస్టీ యువతకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకము ద్వారా గ్యారెంటీ లేని రుణాలు అందిస్తామన్నారు. అదేవిధంగా ముఖ్యంగా కమ్మరి, వడ్రంగి, ఔసలి, నాయి బ్రాహ్మణి, మేస్త్రీలు , చాకలి, కుమ్మరి , ఇతర వృత్తుల వారికి ఒక లక్ష రూపాయలు ఎలాంటి గ్యారెంటీ లేకుండా రుణాలు ఇప్పిస్తామన్నారు. తాను నాలుగు జిల్లాలకు నిజామాబాద్ కామారెడ్డి అదిలాబాద్ ఆసిఫాబాద్ జిల్లాలకు ఎమ్మెస్ ఎం ఈ ద్వారా నోడల్ అధికారిగా పనిచేస్తున్నానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్వాస రెడ్డి కార్యదర్శి సిద్దయ్య ప్రిన్సిపాల్ జ్యోతి స్నేహ ఐటీ ప్రోగ్రామ్ మేనేజర్ మోహిజ్ అహ్మద్ ఎస్టి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# శబరిమలలో భక్తుల రద్దీ... రూ.200 కోట్లు దాటిన ఆదాయం



కేరళలో శబరిమల అయ్యప్పకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది అయ్యప్పను దర్శించుకునేందుకు వచ్చిన వారితో శబరిమల ఆదాయం రూ. 200 కోట్లు దాటింది. 39 రోజుల క్రితం ప్రారంభమైన అయ్యప్ప దర్శనాల్లో భాగంగా ఇప్పటివరకు 31 లక్షల మంది శబరిమల అయ్యప్పను దర్శించుకున్నట్లు ఆలయ బోర్డు వెల్లడించింది.

ఇందులో కానుకల రూపంలో రూ. 63.89 కోట్లు రాగా.. అరవన ప్రసాదం ద్వారా రూ. 96.32 కోట్ల ఆదాయం ఆలయానికి వచ్చిందని తెలిపింది. ఇక ఈ మండల విరక్కు పూజ కాలంలో డిసెంబర్ 25 వ తేదీ నాటికి 39 రోజుల్లో 31,43,163 మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు ట్రావెన్ కోర్ బోర్డు వెల్లడించింది. రేపు డిసెంబర్ 27న మూతపడనున్న అయ్యప్ప ఆలయం.. మకరవిలక్కు పండుగ కోసం మళ్లీ డిసెంబర్ 30వ తేదీన శబరిమల ఆలయాన్ని తెరవనున్నట్లు స్పష్టం చేసింది.

# మాజీ ప్రియుడిని గంజాయి కేసులో ఇరికించేందుకు యువతి కుట్ర



హైదరాబాద్: మాజీ ప్రేమికుడిపై ఓ ప్రియురాలు పగబట్టిన ఘటన ఆసక్తిగా మారింది. ఏకంగా కారులో గంజాయి ప్యాకెట్లు పెట్టి మాజీ ప్రియుడ్ని జైలుకు పంపాలని పన్నాగం పన్నింది.

పోలీసుల దర్యాప్తులో కథ అడ్డం తిరిగింది. వివరాల్లోకి వెళితే.. కొన్నాళ్ళుగా తనను దూరం పెడుతున్నాడని లా స్టూడెంట్ అయిన యువతి తన మాజీ ప్రియుడిపై పగ పెంచుకుంది. ఈ నేపథ్యంలోనే తనను ఎలాగైనా పోలీసులకు పట్టించాలని భావించి నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే ఆ యువకుడి కారులో గంజాయిని పెట్టి, పోలీసులకు ఆమే సమాచారం ఇచ్చి పట్టించేలా చేసింది. విచారణలో యువతే రూ. 4 వేలు పెట్టి గంజాయి కొనుగోలు చేసి.. కారులో పెట్టించిందని తేలింది. దీంతో ఆ యువతితో పాటు మరో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 40 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు రిమాండ్కు తరలించారు.

# 28 నుంచి, ప్రజాపాపన పదిరోజుల పాటు అమలుకు శ్రీకారం

## – ఆరు గ్యారంటీలపై దరఖాస్తుల స్వీకరణ



మల్హర్ రావు: కాంగ్రెస్ ప్రభుత్వం కొలుదిరిన తరువాత సరికొత్త నిర్ణయాలతో ముందుకు సాగుతోంది. ప్రభుత్వ పరిపాలనను ప్రజలవద్దకే తీసుకపోయేలా అడుగులు వేస్తోంది. ప్రజాపరిపాలన పేరుతో పది రోజులపాటు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 28న కార్యక్రమానికి అంకుర్పారణ జరగనుంది. వచ్చేనెల 6 వరకు ప్రజాపాలన పేరుతో గ్రామపంచాయతీ ల్లోనే మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ళు, చేయూత పథకం (ఆరు గ్యారంటీల) దరఖాస్తులు స్వీకరించనుంది. పరిపాలనను గ్రామస్థాయిలో తీసుకెళ్లడంతో పాటు, సమస్యల పరిస్కారానికి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక యంత్రాంగం గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రజలు సమస్యలను నేరుగా విని అక్కడికక్కడే పరిష్కరించాలానేది ప్రధాన ఉద్దేశ్యం. ఇటీవల హైదరాబాద్ లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సిపిలు, ఎస్పీలతో నిర్వహించిన సదస్సులో జిల్లా, మండల, గ్రామస్థాయిలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజాపాలన వేదిక దిక్సుచిగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామస్థాయిలో విద్య, వైద్యం, భూ సమస్యలకు శాశ్వత పరిస్కారం చూపాలని అధికారులకు దిశ, నిర్దేశం చేసింది. తొలుత పది రోజులపాటు గ్రామస్థాయిలో పరిపాలన పెద్ద ఎత్తున నిర్వహించాలాని, ఆ తరువాత వారానికి రెండు రోజులు లేదా నెలలో కొన్ని రోజులు నిర్వహించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

### నేరుగా గ్రామాలకు కలెక్టర్

జిల్లా కలెక్టర్ నేరుగా గ్రామాలకు వెళ్లి ప్రజల గోడు విని అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేసేలా ఈ కార్యక్రమం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అధికారులు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో సభలు నిర్వహిస్తారు. ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను ఈ గ్రామ సభల్లో స్వీకరించి రసీదులు ఇవ్వనున్నారు. దరఖాస్తులు నింపడానికి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లో ప్రజలకు ముందే దరఖాస్తు పారాలు అందించనున్నారు. ఆరు గ్యారంటీల పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడమే లక్ష్యంగా ప్రజాపరిపాలన ఉండేలా అధికార యంత్రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

# ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద లారీ బీభత్సం.. ముగ్గురికి తీవ్ర గాయాలు



నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలో ఓ లారీ బీభత్సం సృష్టించింది. మంగళవారం ఇందల్వాయి టోల్ ప్లాజా దగ్గర వేగంగా వచ్చి ఓ లారీ, ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు..టోల్ ప్లాజా కౌంటర్ లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లారీ డ్రైవర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరు టోల్ ప్లాజా సిబ్బంది, కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి ఉన్నారని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

# తెలంగాణా గ్రూప్-2 పరీక్షల వాయిదా తప్పదా?




ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై మరోసారి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈ పరీక్షలు జనవరి 6,7 తేదీల్లో జరగాల్సి ఉంది. కానీ పది రోజులే సమయం ఉన్నా, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణపై పెదవి విప్పడం లేదు.

గ్రూప్-2 పరీక్షలు నవంబర్ 2,3 తేదీల్లో జరగాలి. కానీ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో 2024 జనవరి 6, 7 తేదీల్లో నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కమిషన్ చైర్మన్ సహా ఐదుగురు సభ్యులు రాజీనామా చేశారు. ఈ రాజీనామాలను గవర్నర్ ఆమోదించవలసి ఉంది.

వివిధ శాఖల్లో ఉన్న 783 ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్లో గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేసింది. ఐదున్నర లక్షలమంది నిరుద్యోగులు దరఖాస్తులు పంపారు. మొదట్లో ఆగస్టు 29, 30 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని కమిషన్ ప్రకటించింది. ఆ తర్వాత నవంబర్ 2, 3 తేదీలకు వాయిదా వేసింది. ఎన్నికల కారణంగా పరీక్షలు జనవరి 6,7 తేదీలకు మళ్లీ వాయిదా పడ్డాయి. ఈసారి కూడా పరీక్షలు జరిగే అవకాశం లేకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

# ఇదేం చలి బాబోయ్

## – పడిపోతున్న ఉష్ణోగ్రతలు
## – కమ్ముకున్న పొగమంచు




మల్హర్ రావు : మండలంలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఒక దశలో 10 డిగ్రీలకు పడిపోవడంతో ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు విడటం లేదు. మంగళవారం మండలంలోని మల్లారం నుంచి కొయ్యుర్ నాగులమ్మ వరకు పొగమంచు కప్పెయ్యడంతో రహదారి స్పష్టంగా కనిపించ లేదు. ఫలితంగా వాహనదారులు లైట్లు వేసుకొని ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా చల్లని గాలులతో చలి తీవ్రంగా పెరుగుతుంది. గత నాలుగు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతున్నాయి. దీంతో పల్లె,పట్టణం అనే తేడా లేకుండా చలి గజగజ వణికిస్తోంది. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ప్రజలు చిన్నా,పెద్ద తేడా లేకుండా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. ఉదయం పూట పొగమంచు కమ్మేస్తుండటం, 9 గంటలైన చలి తగ్గకపోవడంతో వృద్ధులు, చిన్నపిల్లలు విలవిలాడుతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటున్న సాయంత్రం తరువాత చలి తీవ్రత పెరుగుతుంది. అన్ని రకాల సౌకర్యాలు, అన్ని దుస్తులు అందుబాటులో ఉంచుకొని ప్రజలు జగ్రత్తగా ఉండాలని ప్రజలు సూచిస్తున్నారు.

పొంచివున్న వ్యాధులు

చలి తీవ్రతకు మనిషి శరీరంలోని రక్త నాలాలు ముడుచుకుపోతాయి. దీంతో రక్త ప్రసరణ సాపిగా సాగదు. అది గుండె, మెదడుపై ప్రభావం చూపి ఆయాసం,గుండె నొప్పి,బ్రెయిన్ స్ట్రోక్,పిట్స్,ఆకస్మికంగా కుప్పకూలడం వంటివి తలెత్తే ప్రమాదం పొంచివుంది. అధిక చలి వల్ల ఆస్తమా,శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

# తేజస్ క్రేజ్ మామూలుగా లేదు.. కొనేందుకు ఫిలిప్పీన్స్, అర్జెంటీనా, ఈజిప్ట్ ఆసక్తి



ఇండియాలో తయారవుతున్న తేజస్ యుద్ధవిమానాలకు భారీగా క్రేజ్ ఏర్పంది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఈ యుద్ధ విమానాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. తేజస్ లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో ఇండియాలోనే తయారవుతోంది. హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్‌ఈ ఫైటర్ జెట్లను తయారు చేస్తోంది. అయితే ఫిలిప్పీన్స్, నైజీరియా, అర్జెంటీనా, ఈజిప్ట దేశాలు తేజస్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ సీబీ అనంతకృష్ణన్ తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించి ఆయా దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. యూకే నుంచి కొన్ని విమాన భాగాలకు సంబంధించి కొనుగోళ్లు ఫలవంతమైంతే అర్జెంటీనాకు తేజస్ జెట్లను సరఫరా చేయడానికి భారత్ ముందుకు సాగుతుందని చెప్పారు. 1982 ఫాక్లండ్స్ యుద్ధం తర్వాత యూకే, అర్జెంటీనాకు సైనిక విక్రయాలపై ఆంక్షలు విధించింది. యూకే నుంచి తయారైన హార్డ్‌వేర్ ఉన్న వస్తువులను ఆ దేశానికి విక్రయించడాన్ని కూడా నిరోధిస్తోంది. ఈ నేపథ్యంలో యూకే నుంచి సేకరించిన మిలిటరీ హార్డ్ వేర్ కలిగిన తేజస్ యుద్ధ విమానాలను అర్జెంటీనాకు విక్రయించడం సమస్యగా మారింది. దళంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆ దేశానికి చెందిన టూ టన్ క్లాస్ హెలికాప్టర్ విడిభాగాలు, వాటికి సంబంధించిన సేవలను అందించడానికి ఈ ఒప్పందం సాయపడుతుంది. ఇదిలా ఉంటే చైనా ముప్పును ఎదుర్కొనేందుకు ఫిలిప్పీన్స్ ఇటీవల భారత మిలిటరీ వస్తువులపై ఆధారపడుతోంది. ఇప్పటికే ఈ దేశం బ్రహ్మోస్ మిస్సైల్ కొనుగోలుకు సంబంధించిన ఒప్పందం చేసుకుంది. గత కొన్నేళ్లుగా భారత్-ఫిలిప్పీన్స్ మధ్య రక్షణ సంబంధాలు పెరిగాయి. తేజస్ యుద్ధ విమాన విషయానికి వస్తే ఇది సింగిల్ ఇంజన్ మల్టీ రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, ఇది ప్రమాదకర ఎయిర్ ఇన్విరాన్మెంట్‌లో పనిచేయగలదు. ఇది వైమానిక రక్షణ, సముద్ర నిఘా, స్ట్రైక్ రోల్స్ చేపట్టేందుకు రూపొందించబడింది. ఇది ఇప్పటికే దాదాపు 40 తేజస్ ప్రారంభ వేరియంట్‌లను ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 2021లో, రక్షణ మంత్రిత్వ శాఖ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కోసం 83 తేజస్ MK-1A జెట్‌ల కొనుగోలు కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో ? 48,000 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. గత నెలలో, IAF కోసం 97 తేజస్ జెట్‌ల అదనపు బ్యాచ్‌ను కొనుగోలు చేయడానికి మంత్రిత్వ శాఖ ప్రాథమిక ఆమోదం తెలిపింది

# నిందితున్ని కఠినంగా శిక్షించాలి

మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రసాద్,అతని కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే నిందితుడు ఆరుగురిని అతి కిరాతకంగా హత్య చేశారు. హత్యకు సహావారించిన వారిని వెంటనే ఉరితీయాలని అఖిలభారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మాణిక్ బండ ర్ చెక్క దగ్గర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కలకలం రేపిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను ప్రజా కోర్టులో ఉరితీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీసం చిన్నపిల్లలను చూడకుండా అతి దారుణంగా చంపి నా సైకో ప్రశాంత్ అతనికి సహరించిన ఏ రాజకీయ పార్టీ నాయకులైన కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఇకమీదట ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రజలు భయ ప్రాంతాలకు గురికాకుండా చూడాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతన్న, నాయకులు లక్ష్మణ్, సుమన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేదా!



విశాఖ బ్యూరో : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రూ.150 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఆధునీకరణ పనుల పేరుతో వేలాడే జెట్టీలను నిర్మించి ప్రమాదాలుగనక చోటుచేసుకుంటే ఆ వంకతో అక్కడ నుంచి శాశ్వతంగా మత్స్యకారులను తరలించే ఆలోచన దీని వెనుక ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫింగర్ జెట్టీలు నిర్మించాలని మత్స్యకారులు కోరుతుండగా ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణానికి డిపిఆర్ సిద్ధమైంది. దీనిపై మత్స్యకారుల అభిప్రాయాలు తీసుకోకుండానే కేంద్ర, రాష్ర ప్రభుత్వాలు ముందుకు వెళ్లాలని చూస్తున్నాయి. దీనివల్ల తమకు ఉపయోగం ఉండదని మత్స్యకారులు చెప్తున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 11జెట్టీలు ఉన్నాయి. ఇవి మత్స్యకారులకు ఎంతోగానే ఉపయోగపడుతున్నాయి. పెరిగిన అవసరాల దృష్ట్యా ఇవి చాలడం లేదు. దీంతో, కొత్త జెట్టీల నిర్మాణం తెరపైకి వచ్చింది. అప్పట్లో రూ.40 కోట్లతో డిపిఆర్ తయారైంది.గత టిడిపి ప్రభుత్వం రూ.23 కోట్లకు పాలనా ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒత్తిడి చేయకపోవడంతో ఆచరణ రూపం దాల్చలేదు. కేంద్రంలో అధికారంలోన్న బిజెపి ప్రభుత్వం జెట్టీల విషయంలో తన విధానాన్ని మార్చుకుంది. ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణంపై వైపు మొగ్గ చూపుతోంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక 2019లో వీటిపై మళ్లీ చర్చ మొదలైంది. అప్పటి కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి గిరిధర్ సింగ్ విశాఖ హార్బర్‌కు విచ్చేసి రూ.100 కోట్లతో ప్రణాళికలు తయారు చేసి వెళ్లిపోయారు. కానీ, ఒక్క రూపాయీ విడుదల కాలేదు. ఈలోగా 2022లో ఈ డిపిఆర్ రూ.150 కోట్లకు ఎగబాకింది. విశాఖ ఫిషింగ్ హార్బర్ పక్కనే ప్రయివేట్ విసిటిపిఎల్ విస్తరణ బెర్తు ఏర్పాటు కావడంతో ప్రయివేట్ వ్యాపారుల లాభార్జనే ధ్యేయంగా ఫింగర్ జెట్టీకి కాకుండా ఫ్లోటింగ్ జెట్టీ దిశగా పాలకులు అడుగులు వేస్తున్నారు. 20 ఏళ్లుగా ఒక్క వెసెల్‌ను కూడా తీయడానికి కృషి చేయలేదు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 700 వరకూ మెకనైజ్డ్ (ఆధునిక బోట్లు), మరో మూడు వేల వరకూ చిన్నచిన్న బోట్లూ ఉన్నాయి. మొత్తంగా 15 వేల మంది మత్స్యకా రులు ఈ హార్బర్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు, కోల్డ్ స్టోరేజీ, శానిటేషన్ అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నారు. 200 బోట్ల కోసం మాత్రమే గతంలో 11 జెట్టీలను నిర్మించారు. ఓ వైపు బోట్లు సంఖ్య పెరుగుతున్నా జెట్టీల సంఖ్య పెరగలేదు. మరోవైపు ఉన్న జెట్టీల్లో కొన్నింటిపై కోస్ట్‌గార్డ్‌ల పెత్తనం ఉండడంతో మత్స్యకారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో బోట్ల నిలుపుదలకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలాభావం పెద్ద సమస్యగా మారింది. మత్స్యసంపదను సముద్రం నుంచి వేగంగా తెచ్చుకుని అమ్ముకోవడం, రవాణాకు అనువుగా ఉండేలా ఆధునీకరణ జరగాలని, కొత్తగా ఫింగర్ జట్టీలు నిర్మించాలని మత్స్యకారులు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. ఫ్లోటింగ్ జెట్టీలతో సమస్యలు తలెత్తనున్నాయని, దీనిపైకి 30 మంది మత్స్యకారులు వెళితే జెట్టీ మునిగిపోవడం ఖాయమని మత్స్యకార సంఘం నాయకులు చంద్రశేఖర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఫింగర్ జట్టీపైకి వందమంది వెళ్లినా ఏమీకాదని పేర్కొన్నారు. బోట్ల యజమానులతో సమావేశం నిర్వహించి ఫ్లోటింగ్ హార్బర్ జెట్టీపై అభిప్రాయం తీసుకోలేదని ఆయన అంటున్నారు.

# సిరులు కురిపిస్తున్న కెపి ఉల్లి



చాపాడు ఉల్లి పేరు వినగానే మార్కెట్లో ఎవరి నోట విన్నా ఘాటు వినిపిస్తుంది. కెపి (కృష్ణా పురం) ఉల్లి ధరలు మరింత ఘాటుగా ఉండటంతో సాగు చేసిన రైతులకు ఈ ఏడాది సిరు లు కురిపిస్తున్నాయి. రెండేళ్ల కంటే అధిక ధరలు పలుకుతున్నాయి. ఈ ఏడాది కెపి ఉల్లికి మార్కెట్ లో మంచి డిమాండ్ ఏర్పడింది. గతంలో పండించిన పంటను అమ్మకం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ ఏడాది పంట పోలాలోకి వ్యాపారులు వరుస కడుతున్నారు. నూర్పిడి చేసిన వెంటనే కొనుగోలు చేసి తరలిస్తున్నారు.కెపి ఉల్లి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది రూ.పది సంపాదించుకునే అవకాశం ఏర్పడింది. కొన్నేళ్ళుగా పండించిన పంటను అమ్ముకునేందుకు మాత్రం నానా కష్టాలు పడాల్సి వచ్చేది. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొంటున్నారు .విత్తనాలు కిలో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు వెచ్చించి కొనుగోలు చేసి ఎకరాకు 23 కిలోల వంతున వినియోగించారు. ప్రస్తుతం నూర్పిడి చేసేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. గత నెలలో వర్షాలు పడటంతో ఉల్లిగడ్డలు కుళ్లి ఇబ్బందికరంగా మారి దిగుబడి మాత్రం తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. క్వింటా రూ.9500 నుంచి రూ.10 వేలు పలుకుతుండటంతో దళారులు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. రాయలసీమకు విదేశీ మారక ద్రవ్యం తీసుకువచ్చే అతి పెద్ద పంట కెపి ఉల్లి. అలాంటి విదేశీ ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం గతంలో నిషేధించడంతో అమ్మకానికి రైతులు నానా అవస్థలు పడేవారు. ఈ ఏడాది రైతులకు సమస్య తొలగిపోయినది. స్థానికంగా అమ్మకం చేయాలంటే ధళారులు నిర్ణయించినదే ధర. మైదుకూరు కేంద్రంగా జిల్లాలోని దువ్వూరు, బి.మఠం మండలాలతో పాటు కర్నూలు జిల్లాలో సాగయ్యే ఉల్లికి పలు రోగాలను నయం చేసే గుణం కలిగి ఆరోగ్యప్రదాయినిగా పేరుగాంచినది. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాలో సాగైన ఉల్లిపాయలకు ఈశాన్య ఆసియా దేశాలైన సింగపూర్, మలేషియా, దుబారు, హాంకాంగ్, శ్రీలంక దేశాలలో మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై గతంలో నిషేధం విధించింది. ప్రస్తుతం నిషేధం ఎత్తివేయడంతో ధరలు బాగా ఉన్నాయి. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు, ఎగుమతుల అవసరాలకు పండించే ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉంది. అందుకే ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి కెపి ఉల్లి ఎగుమతులపై నిషేధం తొలగించినది. జిల్లాలో మైదుకూరు, దువ్వూరు ఇతర ప్రాంతాలలో ఈ ఏడాది 4వేల ఎకరాలలో ఉల్లి పంట సాగైంది. దాదాపుగా 15 వేల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రైతులు ఉల్లి పంటను ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో సాగు చేయడం ఆనవాయితీ. ప్రారంభంలో క్వింటా కెపి ఉల్లి ధర రూ.8 వేలతో ప్రారంభమై ప్రస్తుతం రూ.10 వేల వరకు పెరిగాయి. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

# అక్రమంగా కర్నాటకకు కంకర తరలింపు



బొమ్మనహాల్ :అనుమతులు లేకుండా కర్ణాటక రాష్ట్రానికి కంకర తరలుతోంది. బొమ్మనహాల్ మండలంలోని నేమకల్ గ్రామంలోని కంకర మిషన్ల నుండి రోజూ వచ్చే కంకర బోట్, రాజి పౌడర్‌ను యాజమాన్యం కర్ణాటకకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైన్స్, జియాలజీ శాఖల నుండి అనుమతిపొందిన వారే టన్నుల ప్రకారం కంకర బోట్, రాజి పౌడర్ కర్ణాటకలో అమ్మాల్సి ఉంటుంది. కాసులకు కక్కుర్తిపడి అక్రమంగా కంకర కర్ణాటకకు తరలుతున్నా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ప్రయివేటు కంకర మిషన్ల యాజమన్యాంతో కుమ్మక్కై తూతూ మంత్రంగా ట్రిప్ సీట్లు మంజూరుచేసి జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి బారీగా గండిపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కంకర మిషన్ యజమానులు సైతం బళ్లారిలో నివాసం ఉంటున్నందున వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. అధికారులు కంకర తోలేందుకు స్థానికంగా ఉన్న టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులకు అనుమతులు ఇవ్వకుండా కర్నాటకలోని బళ్లారిలో ఉండే వ్యాపారులకు టిప్ సీట్లు అందజేస్తున్నట్లు సమాచారం. బొమ్మనహాల్ మండలంలో కంకర ఫ్యాక్టరీలు బోలెడు ఉన్నా స్థానికంగా భవన నిర్మాణాలకు కంకర అందుబాటులో ఉండడంలేదు. ప్రతిరోజు సుమారు 20 టిప్పర్ల పైబడి కంకర కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నట్లు నెమకల్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆంధ్రాలో కంకర మిషన్లు ఉన్నా లాభాలు మాత్రం కర్ణాటక వారికే దక్కుతున్నాయని వాపోతున్నారు. పునాదులకు అవసరమైన బోట్ రాస్ తమకు దొరకడం లేదు.. కర్ణాటకలోని వారికి మాత్రం కేవలం గంట సమయంలోనే అందిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అనుమతులు లేని కార్ణాటక టిప్పర్లు ఆంధ్రాలో ప్రవేశించి కంకర లోడు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. క్వారీల్లో 20 అడుగుల లోతు మాత్రమే బ్లాస్టింగ్ చేయాలి. సుమారు 50 అడుగులకు పైబడి బ్లాస్టింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు అక్రమ కంకర రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# అభ్యంతరాలుంటే తెలపండి : కలెక్టర్



చిత్తూరు:ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ విడుదల చేయడం జరిగిందని, అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఓటర్ల జాబితాలను విడుదల చేయడం జరిగిందని అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చునని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆధార్ లింకేజీ మార్చి 31వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణ అన్నారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్రోల్మెంట్ అధికారిగా వ్యవహరిస్తున్న డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఎస్ఆర్ 2023 మేరకు ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15లక్షల 43వేల 730 మంది ఉన్నారని, ఇందులో పురుషులు 7,65, 833 కాగా, మహిళలు 7,77,784 మంది ట్రాన్స్ జెండర్‌లు 113 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి 1000 మంది పురుషులకు 1016 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా మహిళలు ఎక్కువగా నగిరిలో ఉన్నారని తక్కువగా కుప్పం నియోజకవర్గంలో ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఫైనల్ జాబితా విడుదల చేయడం జరిగిందని, చిత్తూరు జిల్లాలో 54,237 మంది గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోగా, టీచర్ల స్థానానికి సంబంధించి 3,545 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. మొత్తం ఎమ్మెల్సీ స్థానానికి గాను ప్రస్తుత ఆరు జిల్లాల పరిధిలో 383061 మంది, టీచర్ల స్థానానికి 26, 888 మంది ఓటర్లుగా నమోదు అయి ఉన్నారని ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఇవ్వవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లో వారీగా ఇప్పటికే జాబితాలు ఇవ్వడం జరిగిందని ప్రతి 14మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఇటీవల మార్పులు చేర్పుల్లో కొంత సంఖ్య పెరగడంతో ఈ ప్రతిపాదనలను తిరిగి పంపడం చేశామని తెలిపారు. ఆధార్ అప్డేషన్‌కు సంబంధించి మార్చి31 వరకు సమయం ఉందని ఈ కార్యక్రమం వేగవంతంగా చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆ విధంగా అందరూ కషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే నామినేషన్ల రోజు వరకు స్వీకరించడం జరుగుతుందని, టీచర్ల ఓటు నమోదు కార్యక్రమంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చునని ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్, ప్రతి ఆర్డీవో కమిటీ మెంబర్లుగా ఉంటారన్నారు. జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌డిసి పర్వీన్, ఆర్డీవోలు శివయ్య, సజన ఇతర తహశీల్దార్లతో పాటు రాజకీయ పార్టీల నుంచి సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగారాజు, బహుజన సమాజ్ పార్టీ నుంచి నాగరాజు, బిజెపి నుంచి రామభద్ర, సిపిఐ నుంచి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి పరదేశి, టిడిపి నుంచి సురేంద్ర కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి మురుగేష్ లు పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## అఖిల భారత కిసాన్ సంస్థ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య డిమాండ్



ఒంగోలు : ప్రధాని నరేంద్ర మోడీ రైతు సంఘాల నేతలకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అఖిల భారత కిసాన్ సంస్థ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. ఈనెల 26న ఒంగోలులో నిర్వహిస్తున్న ట్రాక్టర్ల నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా రైతు సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుందూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రావుల వెంకయ్య మాట్లాడుతూ ఉత్తర భారతదేశం హర్యానాలోని జుండ్ కేంద్రంగా ఈనెల 26న లక్ష ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ రైతు సంఘాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో రైతులు ట్రాక్టర్ ర్యాలీలను నిర్వహించి జయప్రదం చేయాలని కోరారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ కేంద్రంగా 5,405 రైతు సంఘాలు ఆధ్వర్యంలో ఏడాది పాటు నడిచిన ఉద్యమం చారిత్రాత్మకమన్నారు. ఈ ఉద్యమాన్ని ప్రపంచం గుర్తించిందని, ఐక్యరాజ్యసమితి తమ మద్దతును ఇచ్చిందన్నారు. చివరకు సుప్రీంకోర్టు కూడా కొన్ని రోజులపాటు రైతాంగ ఉద్యమాన్ని ఆపివేయాలంటూ పదేపదే కోరిందన్నారు. చివరకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారత జాతికి క్షమాపణలు చెబుతూ మూడు చట్టాలను రద్దు రద్దు చేశారన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుందూరి రంగారావు మాట్లాడుతూ రాతపూర్వకంగా ప్రధాని మోడీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 26న ట్రాక్టర్ల నిరసన ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు, పట్టణాలలోని అల్పాదాయ వర్గాలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను భాగమైన స్వామినాథన్ సిఫార్సులకు చట్టబద్ధం చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. మాండూస్ తుఫాన్ తో ప్రకాశం జిల్లాలో 11,000 ఎకరాలలో పొగాకు పంట దెబ్బతిందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వంతోపాటు, పొగాకు బోర్డు గుర్తించిందన్నారు. బోర్డు వద్ద రైతులకు సంబంధించిన రూ.635 కోట్లు నగదు ఉందని, విపత్తు సమయంలో కేంద్రం వెంటనే స్పందించి బోర్డు ద్వారా పొగాకు రైతులకు పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు రూ. 1200 కోట్లు వెంటనే మంజూరు చేసి సెప్టెంబర్ నాటికి వెలుగొండ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మాబు మాట్లాడుతూ చారిత్రాత్మక ఉద్యమాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలివిగా విరమింపచేశామని అనుకుంటుందని, రైతాంగ ఉద్యమం తాత్కాలిక విరమణ మాత్రమేనని తెలిపారు.

# ఈ రోడ్లు వేసేదెన్నడో..!



వీరవాసరం:నిధులున్నా పనులు ప్రారంభించని స్థితిలో వీరవాసరం-పెనుమంత్ర ఆర్అండ్‌బి రహదారి అధ్వానంగా ఉంది. నాలుగేళ్లుగా ఈ మార్గంలో అనేక అవస్థలు పడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు ఈ రహదారి నిర్మాణంపై దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. ఈ మార్గంలో వీరవాసరం రైల్వే గేటు నుండి సుమారు మూడు కిలోమీటర్ల వరకు పటిష్టపర్చడానికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) నుండి సుమారు ఐదున్నర కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టడానికి కాంట్రాక్టు సైతం ఖరారైంది. ప్రస్తుతమున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా సర్వే పూర్తి చేసి కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రోడ్డు విస్తరణ పనులు మాత్రం ఇంకా మొదలు కాలేదు. రోడ్డు విస్తరణ, అభివృద్ధికి నిధులు మంజూరవ్వడంతో అధికారులు కనీసం గోతులు కూడా పూడ్చకుండా వదిలేశారు. అదే సమయంలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో
జనాలకు కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి ఈ రహదారి విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు స్పందించకపోవడం గమనార్హం. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు వర్షాకాలంలో పెద్దపెద్ద గోతులతో నిండి ఉంటుంది. ఈ గోతుల్లో పడి అనేక మంది గాయాల పాలైన పరిస్థితీ ఉంది. ఈ ప్రాంతంలో అడపాదడపా మరమ్మతులు చేస్తున్నా కొద్దిరోజులకే మళ్లీ యథాస్థితికి చేరడంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులకు కష్టాలు మాత్రం తప్పడం లేదు.

# ప్రజలకు మంచి చేసే లక్ష్యంతో కలిసి పనిచేయండి

## - ఎమ్మెల్యే నంబూరు



అమరావతి:ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు కలిసి పని చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. మండల కేంద్రమైన అమరావతి లోని శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ కళ్యాణ మండపంలో గృహసారథుల నియామకంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర రావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్న లక్ష్యంతో
ముఖ్య మంత్రి వైఎస్ ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమిస్తున్నారన్నారు.
ఇప్పటికే నియోజకవర్గంలో 72 సచివాలయాలకు కన్వీనర్ల నియామకం పూర్తైందన్నారు. అమ రావతి మండల పరిధిలోని మల్లాది గ్రామానికి చెందిన భవిరిశెట్టి హనుమంతరావును మండల సచివాలయాల కన్వీనర్ గా నియమించడం జరిగిందన్నారు.

# ఇక చిన్న రుణాలు పుట్టవు..!

న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ డిజిటల్ వేదికలపై పొందుతున్న చిన్న రుణాల జారీ ఇకపై కఠినతరం కానుంది.ముఖ్యంగా రూ.50,000 లోపు వ్యక్తిగత రుణాల జారీని పరిమితం చేయాలని బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి)లు తమ ఫిన్‌టెక్ భాగస్వామ్య సంస్థలను ఆదేశించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. ఇటీవల వ్యక్తిగత రుణాల జారీ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను కఠినతరం చేసిన విషయం తెలిసిందే. హామీలేని వ్యక్తిగత రుణాలకు రిస్క్ వెయిట్‌ను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. ఈ నేపథ్యంలోనే బ్యాంక్‌లు తమ ఫిన్‌టెక్ భాగస్వాములను అప్రమత్తం చేశాయి.వ్యక్తిగత రుణాల జారీ పెంచాల్సి వస్తే.. బ్యాంకులు మరింత మూలధనాన్ని కేటాయించాలని ఆర్‌బిఐ సూచించింది. ఎన్‌బిఎఫ్‌సిల ద్వారా అధిక రుణాలు జారీ చేయడం ద్వారా ప్రమాదాలకు దారి తీయవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్‌బిఐ స్పష్టమైన సంకేతాలతో తాము వ్యక్తిగత రుణాల జారీని తగ్గించుకోవాలని తమ ఫిన్‌టెక్ సంస్థలకు సూచనలు చేశామని ప్రయివేటు రంగంలోని ఓ టాప్ బ్యాంకర్ పేర్కొన్నారు.రూ.50,000 కంటే తక్కువ రుణ విభాగంలో ఉండకూడదని తమ ఫిన్‌టెక్ భాగస్వాములకు సూచించామన్నారు. ప్రస్తుత సమయంలో ఫిన్‌టెక్ భాగస్వాములకు నిధులను పూర్తిగా తగ్గించాలని అనుకోనప్పటికీ, చిన్న టికెట్ల వ్యక్తిగత రుణాలపై పెద్దగా వెళ్లడం పట్ల తాము అసౌకర్యాన్ని వ్యక్తం చేశామని మరో బ్యాంకర్ పేర్కొన్నారు. చిన్న రుణాల జారీ పట్ల అప్రమత్తంగా ఉండాలని తమ ఫిన్‌టెక్ భాగస్వాములకూ సూచించామని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకర్ వెల్లడించారు. కొంతకాలం ఆ విభాగానికి దూరంగా ఉండటం మంచిదని భావించామన్నారు. పేటియం షేర్లపై ఒత్తిడి..న్యూఢిల్లీ : రూ.50,000 లోపు ఉండే వ్యక్తిగత రుణాల జారీని తగ్గించుకుంటామని పేటియం ప్రకటించింది.ఇకపై కేవలం పెద్ద రుణాలపైనే దృష్టి సారిస్తామని ఆ సంస్థ బుధవారం తెలిపింది. అదే విధంగా ఇప్పుడు కొనండ్షితర్వాత చెల్లించండి వ్యాపారాన్ని పునర్వ్యవస్థీకరిస్తామని వెల్లడించింది. ఈ పరిణామం గురువారం పేటియం షేర్లను భారీగా నష్టపోయేలా చేసిందిజ ఇంట్రాడేలో 20 శాతం నష్టపోయి బిఎస్ఇలో రూ.650 కనిష్ట స్థాయికి దిగజారిన సూచీ.. తుదకు 18.69 శాతం నష్టంతో రూ.661.30 వద్ద ముగిసింది.

# తొలి టెస్టుకు ముందు రోహిత్ శర్మ

## ఇంట్రెస్టింగ్ కామెంట్స్



దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత జట్టు.. రేపు సెంచూరియన్ వేదికగా సఫారీలతో తొలి టెస్టు ఆడనుంది. కాగా, ఈ నేపథ్యంలో తొలిటెస్టుకు ముందు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.మూడు దశాబ్దాలుగా దక్షిణాఫ్రికా గడ్డమీద టెస్టులు ఆడుతున్నా ఇంతవరకూ ఇక్కడ టెస్టు సిరీస్ గెలవని భారత్..

ఈసారి ఎలాగైనా గెలిచితీరాలనే పట్టుదలతో ఉందని హిట్‌మ్యాన్ చెప్పాడు. తమ మొదటి ప్రాధాన్యత అదేనని అన్నాడు.ఈ సిరీస్ నుంచి గాయం కారణంగా మహ్మద్ షమీ తప్పుకోవడం భారత్‌కు భారీ నష్టమని, అతడి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని హిట్‌మ్యాన్ చెప్పాడు. తొలి టెస్టులో కెఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా ఉండనున్నాడని, అతడు ఎన్నిరోజులు ఇలా డ్యూయల్ రోల్ పోషిస్తాడో తనకూ తెలియదని, కానీ ఇప్పటికైతే అతడు మెరుగ్గా ఆడుతున్నాడని తెలిపాడు. ఇక, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ లు తొలి టెస్ట్ ఆడబోతున్నారని రోహిత్ శర్మ ధృవీకరించారు. మూడో పేసర్‌గా ఎవరు ఉంటారు అనే విషయాన్ని మాత్రం చెప్పలేదు. ముఖేష్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణలలో ఒకరు తుది జట్టులో ఉంటారనే విషయాన్ని మాత్రం చెప్పాడు. ఈ ఇద్దరిలో మూడో పేసర్‌గా ఎవరు బాధ్యతలు నిర్వర్తిస్తారు అనే విషయాన్ని టీమ్ మీటింగ్‌లో నిర్ణయిస్తామని తెలిపాడు. మహ్మద్ షమీ లేకపోవడం లోటేనని అన్నారు.

# స్టీలర్స్‌కు ఐదో విజయం

ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 42-29తో తమిళ్ తలైవాస్ జట్టుపై ఘనవిజయం సాధించింది.ఈ లీగ్‌లో స్టీలర్స్‌కిది ఐదో విజయం కావడం విశేషం. స్టీలర్స్ తరఫున శివమ్ ఎనిమిది పాయింట్లు సాధించగా... జైదీప్ దహియా, రాహుల్ ఏడు పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. తలైవాస్ తరఫున సాహిల్ గులియా పది పాయింట్లు, హిమాన్షు సింగ్ తొమ్మిది పాయింట్లు సాధించారు.

మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 38-29తో బెంగాల్ వారియర్స్ జట్టుపై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌లో పుణేరి పల్టన్‌తో పట్నా పైరేట్స్ తలపడుతుంది. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ హుమేరా బహార్మస్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. నవీ ముంబైలో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో హుమేరా గెలిచి



మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టింది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 'బై' పొందిన హుమేరా రెండో రౌండ్‌లో 6-1, 6-3తో అలెగ్జాండ్రా అజార్కో (రష్యా)పై, మూడో రౌండ్‌లో 3-6, 6-2, 6-4తో జెన్నిఫర్ లుఖమ్ (భారత్)పై విజయం సాధించింది.

# జోరుమీదున్న మహిళలు..

## కంగారూలతో వన్డే, టీ20 సిరీస్‌కు రెడీ



సొంతగడ్డపై వారం వ్యవధిలోనే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో భారత మహిళల జట్టు చారిత్రాత్మక విజయాలు సాధించింది. ఇప్పుడు అదే ఉత్సాహంతో ఆస్ట్రేలియాతో టీ20, వన్డే సిరీస్‌లకు సిద్ధమవుతోంది టీమ్‌ఇండియా.ఆస్ట్రేలియాతో తలపడే భారత టీ20, వన్డే జట్లను ఇవ్వాల (సోమవారం) ప్రకటించింది బీసీసీఐ. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోనే టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. మూడు వన్డేల సిరీస్ డిసెంబర్ 28 నుంచి ఆరంభం కానుండగా, మూడు మ్యాచుల టీ20 సిరీస్ జనవరి 5 నుంచి ఆరంభం కానుంది.వన్డేలకు భారత మహిళల జట్టు :హర్మన్ ప్రీత్ కౌర్ ( కెప్టెన్ ), స్మృతి మంధాన ( వైస్ కెప్టెన్ ), జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, యాస్తికా భాటియా ( వికెట్ కీపర్ ), రిచా ఘోష్ ( వికెట్ కీపర్ ), అమన్‌జోత్ కౌర్, శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్, సైకా ఇషాక్, రేణుకా సింగ్ ఠాకూర్, సాధు, పూజా వస్త్రాకర్, స్నేహ్ రాణా, హర్లీన్ డియోల్ టీ20లకు భారత మహిళల జట్టు : హర్మన్ ప్రీత్ కౌర్ ( కెప్టెన్ ), స్మృతి మంధాన ( వైస్ కెప్టెన్ ), జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, యాస్తికా భాటియా ( వికెట్ కీపర్ ), రిచా ఘోష్ ( వికెట్ కీపర్ ), అమన్‌జోత్ కౌర్, శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్, సైకా ఇషాక్, రేణుకా సింగ్ ఠాకూర్, సాధు, పూజా వస్త్రాకర్, కనికా అహుజా, మిన్ను మణి.

# దక్షిణాఫ్రికా-భారత్ టెస్టు సిరీస్..

## ఐరెన్ లెగ్ అంపైర్ ఔట్



భారత్-దక్షిణాఫ్రికా మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సమయం అసన్నమైంది. మంగళవారం(డిసెంబర్ 26)న జరగనున్న ఇరు జట్లు మధ్య జరగనున్న తొలి టెస్టుతో ఈ రెడ్‌బాల్ సిరీస్ ప్రారంభం కానుంది.అయితే ఈ సిరీస్ నుంచి ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిచర్డ్ కెటిల్‌బరో వ్యక్తిగత కారణాలతో తప్పుకున్నాడు. ఈ క్రమంలో అతడి స్థానాన్ని లాంగ్టన్ రుసెరేను ఐసీసీ భర్తీ చేసింది. కాగా సౌతాఫ్రికా-భారత్ మధ్య టెస్టు సిరీస్‌కు ఐసీసీ తొలుత ప్రకటించిన జాబితాలో అంపైర్లుగా కెటిల్‌బరో, పాల్ రీఫిల్ అహ్సాన్ రజాకు చోటు దక్కింది. ఇప్పుడు కెటిల్‌బరో తప్పుకోవడంతో రుసెరేను ఎంపిక చేస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ సిరీస్ నుంచి కెటిల్‌బరో తప్పుకోవడం పట్ల భారత అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే అతడు అంపైర్‌గా వ్యవహరించిన చాలా మ్యాచ్‌ల్లో టీమిండియా ఓటమి పాలైంది. ముఖ్యంగా ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్స్‌లో భారత జట్టు గెలిచిన సందర్భాలు లేవు. వన్డే వరల్డ్‌కప్-2023 ఫైనల్స్‌లో కూడా కెటిల్‌బరో ఫీల్డ్ అంపైర్‌గా ఉన్నాడు. అంతకుముం?దు 2023 ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్, 2019 వన్డే ప్రపంచ కప్ సెమీస్, ఛాంపియన్స్ ట్రోఫీ-2017 ఫైనల్, 2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్లోనూ భారత్ ఓటమి పాలైంది.

# రోహిత్ సేన సాధించేనా..

## దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

సెంచూరియన్: దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత జట్టు ఇప్పటికే టి20, వన్డేల సిరీస్‌లను చేజిక్కించుకున్న హుషారులో ఉంది. అదే ఊపుతో టెస్టుల్లోనూ బరిలోకి దిగుతోంది. దక్షిణాఫ్రికా పర్యటనకు వేర్వేరు జట్లను పంపిన బిసిసిఐ వ్యూహం ఫలించింది. యువ క్రికెటర్లతో కూడిన టీమిండియా టి20 సిరీస్‌ను 2-1తో, సీనియర్, యువ క్రికెటర్లతో కూడిన టీమిండియా వన్డే సిరీస్‌నూ 2-1తో చేజిక్కించుకుంఇ. ఇక టెస్టుల్లో సీనియర్లందరూ చోటు దక్కించుకొని రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. వన్డే ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తొలిసారి బ్యాట్‌లు పట్టనున్నారు. దక్షిణాఫ్రికా గడ్డపై భారత పురుషుల జట్టు ఇప్పటివరకు టెస్ట్ సిరీస్‌ను గెలిచిన దాఖలాలు లేవు. ఈ గడ్డపై ఇప్పటివరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లు మాత్రమే సఫారీ జట్టు సిరీస్‌ను సాధించాయి. దీంతో భారత్‌కు ఇప్పటివరకు అందని ద్రాక్షగా ఉన్న సఫారీ గడ్డపై సిరీస్‌ను చేజిక్కించుకోవాలన్న దృఢ నిశ్చయంతో బరిలోకి దిగుతోంది. ఇక్కడి పిచ్‌లో పేస్‌కు అనుకూలిస్తాయి కాబట్టి నలుగురు పేసర్లతో బరిలోకి దిగినా ఆశ్చర్యపోన్నక్కర్లేదు. దక్షిణాఫ్రికా గడ్డపై 23 టెస్టులాడిన టీమిండియా కేవలం నాలుగింట్లో మాత్రమే విజయం సాధించింది. గతంలో సఫారీ పర్యటనకు మహ్మద్ షమీ 43.83సగటుతో ఆరు వికెట్లు తీసాడు. ఈసారి చీలమండ గాయం కారణంగా షమీ ఈ సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటే.

ఇక దక్షిణాఫ్రికా విషయానికొస్తే.. ఈ సిరీస్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ వీడ్కోలు పలుకుతున్నట్లు స్టార్ బ్యాటర్ డీన్ ఎల్గర్ ఇప్పటికే



ప్రకటించాడు. దీంతో ఈ సిరీస్ చేజారకుండా అతడిని గౌరవంగా సాగనంపాలన్న దృఢనిశ్చయంతో దక్షిణాఫ్రికా జట్టు ఉంది. అలాగే చీలమండ గాయం నుంచి కగిసో రబడా కోలుకొని తిరిగి జట్టులో చేరాడు. దీంతో సఫారీ జట్టు బౌలింగ్ విభాగం పటిష్టంగా తయారైంది. అనుభజ్ఞుడైన రబడా సొంతగడ్డపై చెలరేగడం ఖాయం. వన్డే ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికాజట్టు కెప్టెన్‌గా ఉన్న బవుమా వన్డే, టి20ల్లో చోటు దక్కించుకోలేకపోయినా.. తిరిగి టెస్టుల్లో పగ్గాలు అందుకున్నాడు. అన్ని విభాగాల్లో దక్షిణాఫ్రికా ఫీల్డర్లు రాణిస్తే భారత్‌కు కష్టాలు తప్పవు. మెరుగైన రికార్డుతో కోహ్లి సఫారీ గడ్డపై మెరుగైన బ్యాటింగ్ రికార్డు ఉంది ఒక్క విరాట్ కోహ్లికి మాత్రమే. అతడు ఆ జట్టుపై 49.29సగటును కలిగి ఉన్నాడు. ఇక రోహిత్ శర్మ 46.54సగటు కలిగి ఉన్నా ఇక్కడ క్రీజ్‌లో నిలదొక్కుకోవడం కష్టమే. శుభ్‌మన్ గిల్, జైస్వాల్, శ్రేయస్ అయ్యర్‌లకు ఇదే తొలి దక్షిణాఫ్రికా సిరీస్.

# వారిద్దరూ దుమ్మురేపుతారు

సెంచూరియాన్ వేదికగా డిసెంబర్-26 నుంచి దక్షిణాఫ్రికా-భారత్ తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను శుభారంభం చేయాలని ఇరు జట్లు భావిస్తున్నాయి. ఈ మ్యాచ్ కోసం దక్షిణాఫ్రికా,భారత జట్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించాయి. తమ సొంత గడ్డపై టెస్టుల్లో భారత్‌పై అధిపత్యాన్ని చెలాయించాలని సౌతాఫ్రికా భావిస్తుంటే.. టీమిండియా మాత్రం తొలిసారి సఫారీ గడ్డపై టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకోవాలని కసితో ఉంది. ఈ సిరీస్‌కు టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి అందుబాటులో ఉన్నారు. వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఈ సీనియర్ ద్వయంకు ఇదే తొలి ద్వైపాక్షిక సిరీస్ కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో 'విరోహిత్'ను ఉద్దేశించి భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రోటీస్ సిరీస్‌లో విరాట్, రోహిత్ పరుగులు పరుగుల వరద పారిస్తారని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం జట్టులో విరాట్, రోహిత్ శర్మ చాలా అనుభవజ్ఞులైన బ్యాటర్లు. వారిద్దరికి దక్షిణాఫ్రికా పిచ్‌లపై ఆడిన అనుభవం ఉంది. కాబట్టి ఈ టెస్టు సిరీస్‌లో వారిద్దరూ



భారీగా పరుగులు సాధిస్తారని నేను భావిస్తున్నాను. ఈసారి దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎటాక్ కొంచెం వీక్‌గా ఉంది. ఈ సిరీస్‌కు సీనియర్ పేసర్లు నోర్జే, లుంగి ఎంగిడీ దూరమయ్యారు. రబాడ అందుబాటుపై ఇంకా క్లారిటీ లేదు. దీంతో భారత్ భారీ స్కోర్ చేసే అవకాశముందని స్టార్‌స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గవాస్కర్ పేర్కొన్నాడు.

# కేరళ జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా సంజూ శాంసన్



రంజీ ట్రోఫీ 2023-24 సీజన్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు 16 మంది సభ్యులతో కూడిన తమ జట్టును కేరళ క్రికెట్ అసోషియేషన్ ప్రకటించింది. మొదటి రెండు మ్యాచ్‌లకు కేరళ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్ ఎంపికయ్యాడు.డైనమిక్ ఓపెనర్ రోహన్ కునుమ్మల్ సంజూకు డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్ విష్ణు వినోద్, స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ సిజోమన్ జోసెఫ్‌కు సెలక్టర్లు మళ్లీ పిలుపునిచ్చారు.అదే విధంగా యువ వికెట్ కీపర్ విష్ణు రాజ్‌కు తొలిసారి కేరళ రంజీ జట్టులో చోటు దక్కింది. ఈ జట్టులో శ్రేయాస్ గోపాల్, జలజ్ సక్సేనా వంటి సీనియర్ ఆటగాళ్లు ఉన్నారు. వచ్చే రంజీ సీజన్‌లో కేరళ తమ తొలి మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ జనవరి 5 నుంచి అలప్పుజా వేదికగా ప్రారంభం కానుంది.ఇక ఇది ఇలా ఉండగా.. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో సంజూ తొలి అంతర్జాతీయ సెంచరీని నమోదు చేశాడు. 114 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 108 పరుగులు చేశాడు. తన అద్భుత ప్రదర్శనకు గాను శాంసన్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. రంజీ ట్రోఫీకి కేరళ జట్టు: సంజు శాంసన్ (కెప్టెన్), రోహన్ కున్నుమ్మల్ (వైస్ కెప్టెన్), కృష్ణ ప్రసాద్, ఆనంద్ కృష్ణన్, రోహన్ ప్రేమ్, సచిన్ బేబీ, విష్ణు వినోద్, అక్షయ్ చంద్రన్, శ్రేయాస్ గోపాల్, జలజ్ సక్సేనా, వైశాక్ చంద్రన్, బాసిల్ థంపి, విశ్వేశ్వర్ ఎ సురేష్, ఎం డి నిధీష్, బాసిల్, విష్ణు రాజ్

# స్టార్ బౌలర్లకు షాకిచ్చిన అఫ్గన్ బోర్డు..

స్టార్ బౌలర్లు నవీన్ ఉల్ హక్, ఫజల్‌హక్ ఫారూకీ, ముజీబ్ ఉర్ రహ్మమాన్‌లకు ఊహించని షాకిచ్చింది అఫ్గనిస్తాన్ క్రికెట్ బోర్డు.విదేశీ లీగ్‌లలో రెండేళ్ల పాటు ఆడకూడకుండా నిషేధం విధించింది.అంతేగాకుండా.. ఈ ముగ్గురి సెంట్రల్ కాంట్రాక్టుల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. నవీన్, ఫారూకీ, ముజీబ్.. జాతీయ జట్టును కాదని ఫ్రాంఛైజీ క్రికెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్న కారణంగా ఈ మేరకు ఏసీబీ కఠిన నిర్ణయం తీసుకుంది.ఈ విషయాన్ని లోతుగా పరిశీలించేందుకు విచారణ కమిటీని కూడా నియమించింది. ఒకవేళ జాతీయ జట్టు ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారని తేలితే నవీన్, ఫారూకీ, ముజీబ్ సెంట్రల్ కాంట్రాక్టులను ఏడాది పాటు రద్దు చేసేందుకు సిద్ధమైనట్లు ఏసీబీ తెలిపింది. అఫ్గన్ బోర్డు నిర్ణయం కారణంగా ఐపీఎల్ ఫ్రాంఛైజీలు కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. కాగా ఐపీఎల్-2024 మినీ వేలంలో భాగంగా రైటార్మ్ స్పిన్నర్ ముజీబ్ ఉర్ రహ్మాన్‌ను కేకేఆర్.. రూ. 2 కోట్ల కనీస ధరకు అతడిని కొనుగోలు చేసింది.మరోవైపు.. ఐపీఎల్-2023 సందర్భంగా రూ. 50 లక్షలకు పేసర్ నవీన్ ఉల్ హక్‌ను సొంతం చేసుకున్న లక్నో.. 2024 వేలానికి ముందు అతడిని రిటైన్ చేసుకుంది.



2023 సీజన్‌లో నవీన్.. మొత్తంగా 11 వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో తన వంతు పాత్ర పోషించాడు. ఇక సీమర్ ఫజల్‌హక్ ఫారూకీని ఎస్ఆర్‌హెచ్ రూ. 50 లక్షలు వెచ్చించి రిటైన్ చేసుకుంది. పదహారో ఎడిషన్‌లో అతడు ఏడు మ్యాచ్‌లు ఆడి ఆరు వికెట్లు కూల్చాడు.

# బాక్సింగ్ డే టెస్టుకు వర్షం అంతరాయం..

## నిలకడగా ఆడుతున్న ఆసీస్

ఆస్ట్రేలియా - పాకిస్తాన్ మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టు (రెండో టెస్టు)లో వర్షం అంతరాయం కలిగించినా ఆసీస్ నిలకడగా ఆడుతోంది. టాస్ సమయానికంటే ముందే కొద్దిసేపు వర్షం కురవడంతో ఆలస్యంగా ఆరంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్.. మొదట బౌలింగ్ ఎంచుకుంది. 66 ఓవర్లే సాధ్యమైన తొలి రోజు ఆటలో ఆసీస్.. మూడు వికెట్లు కోల్పోయి 187 పరుగులు సాధించింది. ఆసీస్ బ్యాటర్లు నిలకడగా ఆడుతూ భారీ స్కోరు దిశగా సాగుతున్నారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఆసీస్‌కు ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (38), ఉస్మాన్ ఖవాజా (42)లు తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించి శుభారంభమిచ్చారు. పార్ట్ టైమ్ స్పిన్నర్ అఘా సల్మాన్ వేసిన 28వ ఓవర్లో వార్నర్.. బాబర్ ఆజమ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటవడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. వార్నర్ ఔటయ్యాక కొద్దిసేపటికే ఖవాజా కూడా హసన్ అలీ బౌలింగ్‌లో అఘా సల్మాన్‌కు క్యాచ్ ఇచ్చాడు. 75 బంతులాడి రెండు ఫోర్ల సాయంతో 26 పరుగులే చేసిన స్టీవ్ స్మిత్‌ను అమీర్ జమాల్.. 58వ ఓవర్లో ఐదో బంతికి ఔట్ చేశాడు. దీంతో ఆసీస్ మూడో వికెట్ కోల్పోయింది. వన్ డౌన్‌లో వచ్చిన మార్నస్ లబూషేన్.. (120 బంతుల్లో 44 నాటౌట్, 3 ఫోర్లు), ట్రావిస్ హెడ్ ( 9 నాటౌట్)లు క్రీజులో ఉన్నారు. పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది ఏమాత్రం ప్రభావం చూపలేదు. కొత్త బౌలర్ మిర్ హమ్జా.. 15 ఓవర్లు వేసి నాలుగు మెయిడిన్లతో 27 పరుగులే ఇచ్చినా వికెట్ మాత్రం తీయలేదు.



Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**